Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 24.08.2018, శుక్రవారం సంపుటి : 38 సంచిక : 12 పేజీలు : 12, వెల : ₹ 5


కేర్
డా॥ ఆలూరు స్వరూప్ కుమార్ రెడ్డి M.D.S.
Professor - Department of Conservative Dentistry
Specialist - Cosmetic, Lasers & Implant Dentistry
సూపర్ స్పెషాలిటి దంత వైద్యశాల
పొగతోట, నెల్లూరు ✆ 9247004747
ఉచిత (క్యాష్‌లెస్) దంత వైద్యసేవలు
• రాష్ట్ర పోలీస్ ఉద్యోగులకు, కుటుంబ సభ్యులకు ఆరోగ్య భద్రత
• రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు EHS (ఎంప్లాయిస్ హెల్త్ స్కీము)

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



# తాకట్టులో తెలుగు పౌరుషం

**› తెరపైకి తెలుగు కాంగ్రెస్ › క్షోభించనున్న ఎన్టీఆర్ ఆత్మ**



*ఈ దేశంలో ఒక్కో రాజకీయ పార్టీ చరిత్ర ఒక్కో రకంగా వుంటుంది. బ్రిటీషోళ్ళు పెట్టిన పార్టీ కాంగ్రెస్... మావో, కార్ల్‌మార్క్స్ సిద్ధాంతాల నుండి పుట్టినది కమ్యూనిష్టు పార్టీ... పేదల కోసం సోషలిస్ట్ పార్టీ... బహుజనుల కోసం బిఎస్పీ... ముస్లింల పార్టీగా ముస్లిం లీగ్... ద్రవిడ సంస్కృతి లక్ష్యంగా డిఎంకె... ఇలా ప్రతి పార్టీ పుట్టుక వెనుక కారణం ఉంటుంది. కాని ఈ పార్టీలలో ఏ ఒక్క పార్టీకి లేని చరిత్ర తెలుగుదేశం పార్టీకి వుంది.*

తెలుగుజాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా పుట్టిన పార్టీ. ఢిల్లీ గడ్డపై తెలుగుపౌరుషాన్ని చాటిన పార్టీ. తెలుగు జాతి కీర్తిపతాకగా నిలిచిన పార్టీ. దేశ రాజకీయాలలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్‌పై పోరాటమే లక్ష్యంగా నందమూరి తారక రామారావు స్థాపించిన పార్టీ తెలుగుదేశం. (మిగతా 11వ పేజీలో)

# కేసీఆర్ సై.. బాబు నై!

**› ముందస్తు ఎన్నికలకు తెలుగు సీఎంలు చెరోదారి**

నాయకుడంటే ఎలాఉండాలి. ఏదైనా కుండ బద్ధలు కొట్టేట్లు వుండాలి. తెలంగాణ సీఎం కేసీఆర్ అలాగే వుంటాడు. ఏదీ నాన్చడు. అప్పటికప్పుడే తేల్చేస్తాడు. ముందస్తు ఎన్నికల విషయంలో కూడా ఆయన వైఖరి అలాగే వుంది. ఎవరు వచ్చినా రాకున్నా తాను డిసెంబర్‌లోనే ఎన్నికలకు పోతున్నానని చెప్పి అందర్నీ ఆశ్చర్యపరిచాడు. (మిగతా 11వ పేజీలో)



# అందరి రాళ్ళు... ఆయనపైనే!

**› సోమిరెడ్డి లక్ష్యంగా విమర్శలు**

**రాజకీయాలలో రెండురకాల పోరాటాలుంటాయి. ఒకటి అవతలి పార్టీలోని ప్రత్యర్థులతో పోరాడడం, రెండోది సొంత పార్టీలోని వ్యతిరేకులతో తలపడడం. ఈ తరహా రాజకీయాలను తలచుకుంటే మొదట మనకు దివంగత నేత డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి గుర్తుకు వస్తారు. ఆయన తన రాజకీయ జీవితంలో రాజకీయ ప్రత్యర్థులతో ఎంతగా పోరాడాడో, ప్రజాసమస్యల విషయంలో తన పార్టీ ముఖ్య మంత్రులు, ఇతర నాయకులతో కూడా అంతే పోరాడాడు.**

నెల్లూరుజిల్లా రాజకీయాలను చూస్తే ఆ పాత్రల్లో మనకు మొదటగా గుర్తొచ్చేది ఆ కాలంలో స్వర్గీయ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి. ప్రస్తుత కాలంలో చూస్తే మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి. వీళ్ళకు అవతల పార్టీలోకంటే కూడా సొంత పార్టీలోనే ప్రత్యర్థులెక్కువుగా ఉండేవాళ్ళు. ఇప్పుడు వ్యవసాయమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పరిస్థితిని చూద్దాం..! తెలుగుదేశంలోని పలువురు (మిగతా 11వ పేజీలో)




ప్రపంచ ప్రఖ్యాత క్యాన్సర్ వైద్య నిపుణురాలు
డా॥ సి. హరిత, MD, DM గారు
సీనియర్ కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్
క్యాన్సర్ స్పెషలిస్టు మరియు రక్త సంబంధ వ్యాధుల నిపుణులు
సింహపురి హాస్పిటల్స్
మల్టీ-సూపర్ స్పెషాలిటి సర్వీసెస్
20 ఆగస్టు, 2018 వ తేది సోమవారం నుండి
సింహపురి హాస్పిటల్స్ నందు
తమ వైద్య సేవలనందించుచున్నారు.

డా॥ సి. హరిత, MD, DM
క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల కొరకు, అన్ని రకముల క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు, కీమోథెరపీ, బయోలాజికల్ థెరపీ, హార్మోనల్ థెరపీ కొరకు సంప్రదించగలరు.
వివరములకు సంప్రదించండి: 8008 104 200
ఎన్ హెచ్ - 5, చింతారెడ్డిపాలెం క్రాస్‌రోడ్స్, నెల్లూరు - 524002.
ఏపి. ఇండియా ఫోన్: 0861-6680102
E: info@simhapurihospitals.com | www.simhapurihospitals.com

మా గ్రామాల్లో...

# పొలాలు పండి ఆరేళ్ళయ్యిందయ్యా

## - జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డికి రైతుల మొర

మా ఊళ్లో పొలాలు పండి ఆరేళ్ళయ్యింది. నీళ్లు లేక పొలాలు పండక వేలాది ఎకరాల భూమిని బీళ్ళుగానే పెట్టేసుకుంటున్నాం.. ఇంకా ఎంతకాలమీ కష్టాలు అంటూ రైతులు జడ్పీ ఛైర్మెన్ ఎదుట కన్నీరు పెట్టుకున్నారు. ఈనెల 19న జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి బాలాయపల్లి మండలంలోని ఊట్లపల్లి గ్రామంలో మాఊరమ్మ తల్లి ఆలయంలో జరిగిన ప్రత్యేకపూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు ఆయన్ను కలిసి మాట్లాడుతూ ఊట్లపల్లి, పాపిరెడ్డిపల్లి, నిడిగల్లు గ్రామాల్లో పంటలు పండి ఆరేళ్ళయ్యిందంటూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మాఊరమ్మ చెరువుకు నీళ్ళిచ్చి ఆదుకోవాలని, చెరువు కింద సుమారు నాలుగువేల ఎకరాల దాకా మాగాణి ఉందని, చెరువు చుట్టుపక్కల నుంచి గంగనీరు వెళ్తున్నా తమ పొలాలకు మాత్రం ఆ నీరు అందడం లేదని, దీంతో పొలాలు పండించుకోలేక బీడుగా వదిలేసుకుంటున్నామని, కూలి పనులు కూడా దొరక్క ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళాల్సివస్తోందంటూ వారు కంటతడిపెట్టారు. నీళ్ళిస్తామంటూ ఎన్నికలప్పుడు నాయకులు హామీలు ఇస్తారని, కానీ ఆ తర్వాత ఏమాత్రం తమ దుస్థితిని పట్టించుకోవడం లేదని వాపోయారు. అనంతరం బొమ్మిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నెరవేర్చడం లేదని, రైతుల సమస్యలను అసలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక రైతులను ఆదుకుంటామన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చిన వెంటనే మా ఊరమ్మ చెరువుకు గంగ నీటిని ఎత్తిపోతల పథకం ద్వారా అందించి నాలుగువేల ఎకరాల రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సింగంశెట్టి భాస్కర్‌రావు, వైఎస్సార్సీపి రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గూడూరు భాస్కర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు బట్టేపాటి మురళీమోహన్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు హఫీజ్, నిడిగల్లు ఎంపిటిసి హనుమంతరెడ్డి, న్యాయవాది పెట్లూరు రాంప్రసాద్, నాయకులు మల్లెమాల గోపిరెడ్డి, ప్రభాకర్, చిన్నా యాదవ్, చంద్రాయాదవ్, ఖలీల్, సుబ్రహ్మణ్యం, మహేష్‌నాయుడు, చింతపూడి రాఘవులు, ఆదిరాఘవులు, మోహన్, రామయ్య, సురేష్‌రెడ్డి, రమేష్‌యాదవ్, చెన్నూరు మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

# వరద బాధితుల సహాయార్థం విరాళాలు



కేరళ వరదబాధితుల సహాయార్థం నెల్లూరులోని కెవిఆర్ నగరపాలక ఉన్నతపాఠశాల 10-ఆంధ్ర నావికాదళ యూనిట్ ఎన్‌సిసి అసోసియేట్ అధికారి గుండాల నరేంద్రబాబు నేతృత్వంలో స్థానిక భక్తవత్సలనగర్ ప్రాంతంలో కేడెట్లు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్ళి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా నరేంద్రబాబు మాట్లాడుతూ, వరద తాకిడికి గురై బాధలుపడుతున్న కేరళ ప్రజలను అందరూ మానవతాదృక్పథంతో ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.విజయప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# కేరళకు 15 టన్నుల బియ్యం

కేరళ వరదబాధితుల సహాయార్థం జిల్లా యంత్రాంగం, రైస్‌మిల్లర్ల ఆధ్వర్యంలో ఈనెల 21న 15 టన్నుల బియ్యం, రెండు టన్నుల ఉప్పు, 200లుంగీలు, 200టవళ్ళు, ఇంకా చీరలు, వంటసామగ్రిని పంపి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సామగ్రినంతా సిద్ధం చేసి కేరళకు పంపే లారీకి జేసీ వెట్రిసెల్వి జెండా ఊపారు. 15 టన్నుల బియ్యాన్ని రైస్‌మిల్లర్లు అందజేయగా, మిగిలిన సామగ్రినంతా పౌరసరఫరాల సంస్థ కార్యాలయ సిబ్బంది సమకూర్చారు. ఈ కార్యక్రమంలో జేసీ-2 కమలకుమారి, డిఆర్‌ఓ నాగేశ్వరరావు, పౌరసరఫరాల సంస్థ డిఎం శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మేకపాటి ఔదార్యం...

కేరళ వరదబాధితులకు తమవంతు సాయంగా ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్సీపి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి 50వేల రూపాయల విలువజేసే బియ్యాన్ని విరాళంగా అందజేశారు. ఆ మేరకు సాయాన్ని తహశీల్దార్ అనిల్‌కుమార్‌కు తన ప్రతినిధుల ద్వారా అందజేసి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. కేరళ బాధితులకు వైఎస్సార్సీపి నాయకులు, కార్యకర్తలు తమవంతు సాయం అందించాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు కూడా.

## ఇరుకళల పరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు

నెల్లూరు గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారికి శ్రావణమాసం సందర్భంగా ఈ నెల 19న ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఎంతో భక్తిశ్రద్ధలతో అమ్మవారికి అష్టోత్తర హారతి, కుంభహారతులను నిర్వహించారు. ఆలయ ఇ.ఓ. వేమూరి గోపి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

# ఓట్ల కొనుగోలుకు ఇప్పుడే రిహార్సలా?

## - స్వచ్ఛ సర్వేక్షణ్ ఓటింగ్‌పై మండిపడ్డ కాకాణి

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జిల్లాకు మొదటి స్థానం వచ్చేందుకు కొందరు అధికారులు నానా యాతనలు పడుతున్నారని, ప్రజలు వేయాల్సిన 5 శాతం ఓట్లకు కూడా ప్రలోభాలు పెడుతూ, ఓటుకు వెయ్యి రూపాయలు ఇస్తామనడం ఏమిటని వైఎస్సార్సీపి నాయకుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నెల్లూరులోని తమ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కాకాణి మాట్లాడుతూ, స్వచ్ఛభారత్, స్వచ్ఛాంధ్రప్రదేశ్‌కు తాము వ్యతిరేకం కాదన్నారు. అయితే ప్రజలను ప్రలోభాలకు గురిచేయడం దురదృష్టకరమని విమర్శించారు. ఇటీవల కార్పొరేషన్‌కు 160వ ర్యాంకు వచ్చిందని, ప్రస్తుతం స్వచ్ఛ సర్వేక్షణ్ జరుగుతోందని, జిల్లాలో సౌకర్యాలు, క్షేత్రస్థాయిలో అమలులో ఉన్న పథకాల తీరుపై కొన్ని మార్కులు ఉంటాయని ఆయన అంటూ, ఇందులో భాగంగా ప్రజలు స్వచ్ఛందంగా ఓటింగ్‌లో పాల్గొని తమ అభిప్రాయాలు తెలపాల్సి వుందన్నారు. అయితే, 5శాతం ఓట్లు వేసేవారి కోసం ప్రత్యేక బహుమతులు, డ్రాలో గెలుపొందితే నగదు ఇస్తామంటూ ప్రలోభపెట్టి ఓట్లు వేయించుకునే సంస్కృతి ఎక్కడిదని ఆయన ప్రశ్నించారు. అధికారులకు ఓటుకు నోటు ఇచ్చే అధికారాన్ని ఎవరిచ్చారని, ఎక్కడి నిధులను ఇస్తున్నారని ఆయన సందేహం వెలిబుచ్చారు. ఓటింగ్ కోసం అధికారులే నగదును ఎరగా చూపడం ఎలాంటి సంకేతాలకు నిదర్శనమని ఆయన ప్రశ్నించారు. ఈ సమావేశంలో జడ్పీటిసిలు వెంకట శేషయ్య, నెల్లూరు శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి

# త్యాగానికి ప్రతీక.. బక్రీద్

ఈ నెల 22వ తేది త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పర్వదినాన్ని ముస్లిం సోదరులందరూ ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నెల్లూరులోని ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బారాషహీద్‌దర్గా ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు చేసిన ఇమామ్ వ ఖతీబ్ సయ్యద్ అబూబకర్ అస్రఫీ సాబిరి మాట్లాడుతూ బక్రీద్ సందేశాన్ని వివరించారు. ఇస్లాం ఒక జీవన మార్గమన్నారు. ఇస్లాం శాంతిని బోధిస్తుందని, హింసను వ్యతిరేకిస్తుందని అన్నారు. త్యాగానికి ముస్లింలు ప్రతిరూపమన్నారు. బక్రీద్ ప్రార్థనల్లో నెల్లూరు రూరల్, నెల్లూరు నగర ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అనిల్ కుమార్‌యాదవ్ పాల్గొని ముస్లిం సోదరులందరికీ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. కార్పొరేటర్లు బొబ్బల శ్రీనివాసయాదవ్, లేబూరు పరమేశ్వరరెడ్డి, వైఎస్సార్సీపి నగర అధ్యక్షుడు తాటి వెంకటేశ్వరరావు, కార్పొరేషన్ కమిషనర్ అలీంబాషా తదితరులు పాల్గొన్నారు.



బక్రీద్ సందేశాన్నిస్తున్న అబూబకర్

### కేరళ బాధితులకు విరాళం :

బక్రీద్ సందర్భంగా బారాషహీద్ దర్గా వద్ద జరిగిన ప్రార్థనలో మేయర్ అబ్దుల్ అజీజ్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కేరళ వరదబాధితులకు కార్పొరేషన్ తరపున 10 లక్షల రూపాయలను, వ్యక్తిగతంగా తాను 2 లక్షల రూపాయలను విరాళంగా అందజేస్తున్నట్లు తెలిపారు.

# ఏపీఇజెఎ కరపత్రం ఆవిష్కరణ



ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అండ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ నెల్లూరుజిల్లా మహాసభ ఈ నెల 28న జరుగనున్న నేపథ్యంలో, ఆ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ఈనెల 21న జిల్లా సమాచారశాఖ డెప్యూటి డైరెక్టర్ లాల్‌జాన్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానిక పత్రికలకు తన వంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గట్టుపల్లి శివకుమార్, జిల్లా కన్వీనర్ ఉడతా రామకృష్ణ, సభ్యులు జి.ప్రతాప్‌రెడ్డి, పి.జె రమేష్‌రెడ్డి, ఉడతా శరత్‌యాదవ్, ప్రసాద్, సరళ, ఎస్‌డి జావీద్, ఏపిఎంఎఫ్ జిల్లా కో-కన్వీనర్ కె. నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

# పెన్షనర్స్ జిల్లా అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఐ. లక్ష్మీనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈనెల 21న నెల్లూరు రోటరీ ఆడిటోరియంలో సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది.. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు కే. ఆల్ఫ్రెడ్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పెన్షనర్లకు 70 సంవత్సరాల తర్వాత 15 శాతం అదనపు పెన్షన్ రావాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే పెన్షనర్లు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలపై చర్చించామన్నారు. వీటి పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా సంఘానికి కార్యవర్గం ఎన్నికలు జరిగాయి. ఎన్నికల అధికారిగా రాష్ట్ర ముఖ్యకార్యదర్శి కె.గోవింద రావు వ్యవహరించారు. అధ్యక్షుడిగా ఐ. లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా శ్రీరాములు, కోశాధికారిగా ఏ. హరిబాబు, సహాధ్యక్షులుగా పి. వీరాస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరి పదవీకాలం మూడు సంవత్సరాలు ఉంటుందని ఎన్నికల అధికారి ప్రకటించారు.

# గొప్ప కవి వాజ్‌పేయి



మాట్లాడుతున్న ఏబీ ఆనంద్

దివంగత ప్రధాని ఏబీ వాజ్‌పేయి ప్రముఖ కవియే గాక గొప్ప రాజ నీతిజ్ఞుడని విశ్రాంత ఆకాశవాణి డైరెక్టర్ ఏబీ ఆనంద్ పేర్కొన్నారు. నెల్లూరు ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఈనెల 20న నిర్వహించిన కవి సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చిన్నప్పటి నుంచి కవితలపై మక్కువ పెంచుకున్న వాజ్ పేయి నిరంతర శ్రమతో గొప్ప కవిగా రాణించారన్నారు. రాజకీయ విలువలు పాటించి రాజనీతిజ్ఞుడిగాను పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య విద్యాసంస్థల అధినేత ఆచార్య ఆదిత్య, బొగ్గరపు రాధాకృష్ణ, దగ్గుపాటి రాధాకృష్ణ, యోగా రవి, గుర్రాల రమణయ్య, చదలవాడ రమణయ్య, బొగ్గరపు ఇందిర పాల్గొన్నారు.

# క్రీడల్లోనూ దూకుడు పెంచాలి

## ముత్తుకూరులో అట్టహాసంగా ప్రారంభమైన 45వ రాష్ట్ర జూనియర్ కబడ్డీ పోటీలు



క్రీడాకారులతో మంత్రి కొల్లు రవీంద్ర

ఆంధ్రరాష్ట్ర 45వ జూనియర్ కబడ్డీ పోటీలకు ముత్తుకూరులోని ఎంపీడీఓ కార్యాలయం వెనుక వున్న మైదానం వేదికయ్యింది. రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల మూలంగా ముత్తుకూరుకు క్రీడా కళ వచ్చింది. సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పర్యవేక్షణలో జరుగుతున్న ఈ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి కొల్లు రవీంద్ర 23వ తేదీన ప్రారంభించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో రాష్ట్రం అన్ని రంగాలలోనూ ముందుకు దూసుకుపోతుందని, క్రీడల్లోనూ దూకుడు పెరిగిందని చెప్పాడు. ఈ కార్యక్రమంలో మాజీఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, టీడీపీ నాయకులు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నాలుగురోజుల పాటు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో నిర్వహించనున్న ఈ పోటీలకు రాష్ట్రంలోని 13 జిల్లాల నుండి దాదాపు 500మంది క్రీడాకారులు విచ్చేసారు. కబడ్డీ బాలుర క్రీడాకారులకు కృష్ణపట్నం పోర్టులోనూ, బాలికలకు మత్స్య కళాశాలలోనూ వసతి ఏర్పాట్లు చేసారు. సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి క్రీడాకారులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా పోటీలను స్వయంగా పర్యవేక్షిస్తున్నాడు.

# ఆనంకు తప్పిన విమాన గండం



మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి 23వ తేదీ విమాన ప్రమాదం నుండి సురక్షితంగా బయటపడ్డాడు. ఆయన ఆరోజు నెల్లూరు రావడానికి శంషాబాద్ ఎయిర్‌పోర్టులో సాయంత్రం 6.42 గంటలకు బయల్దేరే ఇండిగో విమానం ఎక్కాడు. ఆ విమానం టైంకు టేకాఫ్ అయ్యి తిరుపతికి బయల్దేరింది. అయితే గాల్లోకి లేచిన కొద్దిసేపటికే విమానం ఇంజన్‌లో సాంకేతిక లోపం ఏర్పడింది. వెంటనే పైలట్ చాకచక్యంగా విమానాన్ని వెనక్కి మళ్ళించి శంషాబాద్ ఎయిర్‌పోర్టు రన్‌వేపై సురక్షితంగా దించాడు. దీంతో ఆనంతో పాటు అందులోని 68మంది ప్రయాణీకులు బ్రతుకు జీవుడా అంటూ ఊపిరి పీల్చుకున్నారు.

# సేవకు వేళాయెరా...!



ఎన్నికలు దగ్గరకొస్తున్నాయంటే చాలు... రాజకీయ నాయకులకు సేవా కార్యక్రమాలు గుర్తొచ్చేస్తుంటాయి. ఎవరికి వాళ్ళు మదర్‌థెరిస్సా, వినోబాబావే, అన్నాహజారే, డొక్కా సీతమ్మలకు సేవా వారసులమంటూ బయలు దేరుతారు. సొంత డబ్బులు బయటకు తీస్తారు. సొంత పేర్లతో ఛారిటబుల్ ట్రస్ట్‌లను ఏర్పాటు చేస్తారు. ఉచిత వైద్య శిబిరాలు, కంటి వైద్య శిబిరాలు, అన్నదానాలు, ఉపాధి శిక్షణా కేంద్రాలు, మంచినీళ్ళ సరఫరా, వికలాంగులకు ట్రైసైకిల్స్, వీల్‌ఛైర్‌ల పంపిణీ, వృద్ధులకు ఆపరేషన్లు, పేదవిద్యార్థులకు ఆర్థిక సాయం, తాగునీటి ఎద్దడి వున్న ప్రాంతాలలో బోర్లు వేయించడం, చీపుర్లు పట్టి రోడ్లు ఊడవడం... ఇలా ఎన్నెన్నో సేవా కార్యక్రమాలతో నాయకులు ప్రజల ముందుకు వస్తుంటారు. వెరైటీ ఏంటంటే నాయకులు కులాలు మతాల వారీగానే కాక వయస్సుల వారీగా కూడా సేవా కార్యక్రమాలను డిజైన్ చేయడం. ఏ వర్గం వాళ్ళకు ఏమి అవసరమో అదిచేయడం ఈ సేవా కార్యక్రమాలలో ప్రధాన ఉద్దేశ్యం.

ఇప్పుడు నాయకులు యువతను ఆకర్షించడం కోసం సేవా నిరతిని క్రీడారంగం వరకు విస్తృత పరిచారు. ఇటీవల సీఎం కప్ అని, ఛైర్మెన్‌కప్ అని, మేయర్ కప్ అని వివిధ క్రీడా పోటీలు నిర్వహిస్తుండడం చూస్తున్నాం. ఇవన్నీ వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆయా నాయకులు తమను తాము ప్రజల్లో ఫోకస్ చేసుకునేందుకు మొదలు పెడుతున్నవే! ఇక ఎన్నికలు అయిపోయే దాకా ప్రజలు రాజకీయ నాయకులు చేసుకునే సేవలను ఆస్వాదించక తప్పదు!



మాజీముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరు ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని ఈ నెల 23వ తేదీ నెల్లూరు మద్రాసుబస్టాండ్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు

### ఆత్మకూరు తెరపైకి..

# మళ్ళీ 'గజని'

## గెలిస్తే.. గన్‌మెన్‌లు ఓడితే.. వాచ్‌మెన్‌లు



ఎవరీ గజనీ అనుకుంటున్నారా...? మీ గెస్ కరెక్టే! 1999లో కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించి మళ్ళీ 2004లో బీజేపీ నుండి పోటీ చేసి పరాజయం పొందిన బొల్లినేని కృష్ణయ్యే. ఈయనకు వ్యాపార వ్యాపకమే తప్ప రాజకీయ నాయకుల లక్షణాలు అస్సలు వుండవు. అవసరానికన్నట్లుగా ఏదో ఒక పార్టీ అభ్యర్థిగా తెరపైకి రావడం, ఇష్టమొచ్చినట్లుగా పైసలు ఎరవేసి గెలుపు కోసం ప్రయత్నించడం, గెలిస్తే గన్‌మెన్‌లతో, ఓడిపోతే వాచ్‌మెన్‌లతో సరిపెట్టుకోవడం. ఇదీ ఆయన నైజం.

రాజకీయ నాయకుడంటే ప్రజల్ని గుర్తు పెట్టుకోవాలి. పరిచయమైన వాళ్ళ పేర్లు గుర్తుంచుకోవాలి. ముఖ్యమైన వాళ్ళు కనిపిస్తే వాళ్ళని పేరుతో పలకరించాలి. గెలిచినా ఓడినా నిత్యం ప్రజలతో మమేకమై ఉండాలి. ప్రజల కష్టసుఖాలు తెలుసుకుంటుండాలి. కానీ, ఈయన తీరు అంతా "గజని" సినిమాలో 'సూర్య' పాత్రనే తలపిస్తుంది. ఒకటికి 10సార్లు కలిసినా, మనల్ని కలిసిన ప్రతిసారీ మనల్ని మనం పరిచయం చేసుకోవాలే తప్ప ఆయనకు గుర్తుండదు. ఒకవేళ పరిచయం చేసుకున్నా ఆ నిముషం ఓ చిద్విలాసం చిందించి మళ్ళీ మరచిపోయే నైజం కృష్ణయ్యది. ఇప్పుడు తెలుగుదేశం పార్టీ వాళ్ళకి ఆత్మకూరులో దిక్కూ దిశా లేకుండాపోయి పదేళ్ళ తరువాత మళ్ళీ ఈ "గజనీ"ని తెరపైకి తెచ్చారు. ఇక ఆత్మకూరు ఓటర్ల పాట్లు జిల్లా పార్టీ దర్శకుడికే తెలియాలి పాపం...!

### సిఎంఆర్ వార్షికోత్సవ విజేతలకు

# బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులందజేస్తున్న మావూరు శ్రీనివాసరావు, డా॥ జడ్‌యస్

నెల్లూరులోని సిఎంఆర్ షాపింగ్ మాల్ 18వ వార్షికోత్సవం సందర్భంగా శ్రావణమాసం వేడుకల కానుకగా తమ ఖాతాదారులకు ప్రత్యేక ఆఫర్‌లు, బంపర్ బహుమతులు ప్రకటించడం తెలిసిందే! ఈ నెల 18వ తేదీ నుండి డైలీ డ్రాలలో గెలుపొందిన విజేతలకు ఈ నెల 22న షాపింగ్ మాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీఎమ్మెల్యే, టీడీపీ నగర ఇన్‌ఛార్జ్ ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, తెలుగు దేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జడ్.శివప్రసాద్ చేతుల మీదుగా బహుమతులందజేసారు. ఈ సందర్భంగా ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి మాట్లాడుతూ అన్ని తరగతుల ప్రజలకు అందుబాటు ధరలలో నాణ్యమైన ఆభరణాలు, వస్త్రాలు అందిస్తూ సిఎంఆర్ షాపింగ్ మాల్ నమ్మకానికే కేరాఫ్ అడ్రస్‌గా మారిందన్నారు. శ్రావణ మాసం సందర్భంగా ప్రతిరోజూ డైలీడ్రాలు తీస్తూ తమ ఖాతాదారులను ఆనందింపజేస్తున్న సీఎంఆర్ యాజమాన్యాన్ని అభినందించారు. డాక్టర్ జడ్.శివప్రసాద్ మాట్లాడుతూ చందన, సిఎంఆర్ సంస్థలు వ్యాపారంలో ఆధునిక విధానాలు అనుసరించడమే కాకుండా ఖాతాదారుల అభిరుచులకు కూడా పెద్దపీట వేయడం అభినందనీయమన్నారు. సీఎంఆర్ అధినేత మావూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ సంస్థ 18వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 31వ తేదీ వరకు ప్రతిరోజూ 5మంది విజేతలకు బంగారు నెక్లెస్, డైమండ్ ముక్కుపుడక, వెండి గిన్నె, పట్టుచీర, మైక్రోఓవెన్‌లను బహుమతులుగా ఇస్తున్నామని, 500 రూపాయల వస్త్రాల కొనుగోలుపై లేదా 3వేల రూపాయల బంగారం కొనుగోలుపై ఒక కూపన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజీయాడ్స్ అధినేత మోపూరు పెంచలయ్య కూడా పాల్గొన్నాడు.



## 'ప్రభా'తం

పచ్చని ప్రకృతి సోయగాలకి..రమణీయమైన ప్రకృతి సుందర దృశ్యాలకి నెలవై.. పర్యాటకులకు స్వర్గధామంగా పేరొందిన కేరళ..ఇప్పుడు జలవిలయంతో గడగడ వణికిపోతోంది. ఇప్పటికే భారీగా కురిసిన కుండపోత వానలతో, హోరెత్తే ఈదురు గాలులు..ముంచెత్తే వరదలతో కల్లోలమైపోయింది. పచ్చపచ్చని హరిత పతాకాన్ని ఎగురవేస్తూ ఎప్పుడూ ఆహ్లాదంగా ఉండే కేరళ..ఇప్పుడు అన్నమో రామచంద్రా అంటూ అల్లాడిపోతోంది. ఎల్లవేళలా అయ్యప్పస్వామి భక్తుల శరణుఘోషలతో మార్మోగే దివ్యభూమి..ఇప్పుడు వరద తాకిడితో కకావికలమైపోయింది. దేవభూమిలో ఆకలికేకలు మిన్నంటుతున్నాయి. మహిళలు, వృద్ధులు.. పసికూనలు ఆకలికి తట్టుకోలేక మరింతగా అల్లాడిపోతున్నారు. ఎక్కడ చూసినా నీటి ప్రవాహాలే. అలల కల్లోలంతో కేరళ అల్లకల్లోలమైపోయింది. ఈ జలవిలయంలో ఇప్పటిదాకా కనీసం నాలుగువందల మందికిపైగానే వరద నోటికి చిక్కి బలైపోయి ఉంటారని అంచనా. ఇంకా లక్షలాదిమంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. బాధితుల సంఖ్య అసంఖ్యాకంగానే ఉంది. మొత్తంగా సుమారు 20వేల కోట్లకు పైగానే ఆస్తినష్టం ఉంటుందని అంచనా. కేరళలోని 89 పట్టణాలు, 9500గ్రామాలు ఈ విలయంతో జల దిగ్బంధంలో కూరుకుపోయాయని, సుమారు మూడు లక్షల ఇళ్ళ దాకా పూర్తిగా వరదనీటిలో మునిగిపోయాయని సమాచారం. అయితే, వాస్తవానికి ఇలాంటి విపత్తుల్లో ఈ అంచనాలకన్నా మించిన నష్టం..కష్టం మరెంతగానో ఉంటుందని అందరికీ తెలిసిందే. ఆగస్టు 8 నుంచి 15వ తేది వరకు కేరళలో ఎన్నడూ కనీవినీ ఎరుగనంత వర్షం కురిసింది. సాధారణ వర్షపాతం కంటే మూడున్నర రెట్లు అధికంగా వాన విలయంలా వచ్చి ఊపేసింది. ఆగస్టు 16న ఒక్కసారిగా 137 మిల్లీమీటర్లు కురవడంతో భారీవర్షాలతో కేరళ నిండా మునిగిపోయింది. ఒక్క ఇడుక్కి ప్రాంతంలో ఒకేరోజున 266 మిల్లీమీటర్లు కురిసిందంటే చిన్న విషయం కాదు. కుంభవృష్టి అంటే ఇదే. ఒక కిలోమీటర్ మైదానంలో ఆ ఒక్కరోజు వచ్చిన వాననీటిని కుమ్మరిస్తే పదంతస్తుల భవనమంత ఎత్తున జలాశయం ఏర్పడుతుందని.. అంత పెద్దవానను కేరళలో ఈ నూరేళ్ళలో ఎప్పుడూ చూడలేదని వాతావరణ శాస్త్రవేత్తలు చెప్తున్నారు. "అయినా, ఇంతటి జలప్రళయాన్ని మేమెప్పుడూ చూడలేదయ్యా, వానంటే జల్లులుగా కురుస్తుందని అనుకున్నాం కానీ, ఇలా కుండలు పగలగొట్టి పైన కుమ్మరించినట్లు అదేపనిగా రోజుల తరబడి వాన రావడం ఇదేనంటూ".. అక్కడి ప్రజలు ఈ కుంభవృష్టికి బెంబేలెత్తిపోయారు. ఈ జలవిలయంతో కేరళ కష్టం అంతా ఇంతా కాదు. కళ్ళ ముందే తమ ఇళ్ళన్నీ కూలిపోయాయి. లక్షలాదిమంది ప్రజలు సర్వం కోల్పోయారు. పంటలు మునిగిపోయాయి. పశుపక్ష్యాదులెన్నో చనిపోయాయి. ఎటుచూసినా కళేబరాలు..దుర్గంధంతో..బురదమయంగా మారిన వరద నీటి ప్రవాహాలతో నిలువనీడ లేక కేరళ ప్రజలు అల్లాడిపోతున్నారు. కేరళలోని త్రిశూర్, కొట్టాయం, అలెప్పి, ఎర్నాకులం తదితర ప్రాంతాల్లోని రెండు, మూడంతస్తుల భవనాలు సైతం నేలకూలిపోయాయంటే వరదల ఉధృతి ఎంత బలంగా ఉండిందో ఊహించుకోవచ్చు. మొదటి అంతస్తువరకు నీళ్ళలో మునిగిపోయాయంటే ఎంత ఎత్తున నీళ్ళు ప్రవహించాయో అంచనా వేసుకోవచ్చు. పంటలు పూర్తిగా నేలమట్టమైపోయాయి. ఎక్కడ చూసినా నీటి ప్రవాహాలే.. కోలుకోలేని విషాదాలే. మొత్తంగా కేరళ..ఒక విరిగిన కెరటంలా కకావికలమైంది... పగిలిన కన్నీటి కడవలా మిగిలింది. కట్టుబట్టలతో బిక్కుబిక్కుమంటూ ప్రాణాలు ఉగ్గబట్టుకోవడం తప్ప బాధితులకు మరో గత్యంతరం లేని దుస్థితి ఏర్పడింది. చేతిలో చిల్లిగవ్వ కూడా లేక, తినడానికి తిండి, తాగడానికి మంచినీళ్ళు కూడా దొరక్క ప్రజలు పడే బాధలు వర్ణనాతీతం. ప్రకృతి విలయానికి అన్ని వ్యవస్థలూ అస్తవ్యస్తమైపోయాయి. పర్వతప్రాంతమైన ఇదుక్కి జిల్లా, మలప్పురం, త్రిసూర్‌లలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. కోచి అంతర్జాతీయ విమానాశ్రయం పూర్తిగా నీట మునిగిపోయింది. శబరిగిరి వద్ద పంపానది ఉధృతంగానే ఉంది. అయ్యప్పకొండకు వెళ్ళే మార్గమంతా బురదమయమైపోయింది. కేరళంతా ఇదే దుస్థితి. వరద వెళ్ళాక.. బురద మిగిలింది. రోడ్లన్నీ మట్టికొట్టుకుపోయి..ఇళ్ళన్నీ బురద నిండిపోయి..బాధితుల హాహాకారాలు మిన్నుముడుతున్నాయి. తక్షణ సాయంగా కేంద్రం 600కోట్లు ప్రకటించింది. అయినా, అది చాలదు. ఇంత భారీ నష్టాన్ని పూడ్చుకోవాలంటే ఇంకా భారీ నిధులు కావాలి. అనేక రాష్ట్రాలు, ప్రజలు మానవతాదృక్పథంతో తమశక్తి మేరకు విరాళాలు అందిస్తూనే ఉన్నారు. అయినా, కేరళకు జరిగిన నష్టం అంతా ఇంతా కాదు. ఆ విషాదానికి కొలమానాలు లేవు. కేరళ కోలుకోవాలంటే కనీసం పదేళ్ళయినా పడుతుందని నిపుణులు భావిస్తున్నారు. ప్రకృతి ఉపద్రవాన్ని జాతీయవిపత్తుగా పరిగణించి కేంద్రప్రభుత్వం ప్రజలను అన్నివిధాలా ఆదుకోవాలి. ప్రకృతి విపత్తుల నుంచి ప్రజలను గట్టెక్కించేందుకు కేంద్రం ఎల్లవేళలా సిద్ధంగా ఉండాలి. ఇప్పటికే వేలాదిమంది సైనికులు, ఇతర బలగాలు, స్వచ్ఛందసంస్థలు వేలాదిమందిని పునరావాస కేంద్రానికి తరలించి ఆదుకుంటున్నాయి. వీరజవాన్లు ప్రాణాలకు తెగించి అనేక ప్రమాదకర ప్రాంతాల నుంచి సైతం ప్రజలను సహాయక శిబిరాలకు తరలిస్తున్నారు. వారి సేవలకు విలువ కట్టలేం. అయినా, ఒక విలయం..ఎన్నో బాధలకు నిలయం. మరణించినవారి కుటుంబాల వేదనలు వర్ణనాతీతం. బాధితుల నష్టాలు, కష్టాలు ఎవరూ ఆర్చలేరు..తీర్చలేరు. అయినప్పటికీ అందరూ మనవంతు శక్తిమేరకు బాధితులకు బాసటగా ఉంటూ, మరణించినవారి కుటుంబాలకు తమవంతు అండదండలందించాలి. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలి. జలవిలయంతో బావురుమంటున్న కేరళ కన్నీటిని తుడవాలి. అందుకు ప్రభుత్వాలతో పాటు దేశవ్యాప్తంగా ప్రజలందరూ ఒక్కటై బాధితులకు తమవంతు ఆపన్నహస్తం అందించాలి. అదే మానవత్వం...కేరళ ప్రజలను ఆదుకోవడమే ఇప్పుడు అందరి తక్షణ కర్తవ్యం!....

### బోరుమంటున్న మలబారు



భారీవర్షాలతో.. వరదలతో.. జలవిలయంతో కేరళ విలవిలలాడుతోంది. ఇప్పటికే 4వందల మందిదాకా వరదలకు బలైపోయారు. లక్షలాదిమంది నిరాశ్రయులయ్యారు. ఇళ్ళు మునిగిపోయి, సర్వం కోల్పోయి లక్షలాదిమంది ప్రజలు అల్లాడుతున్నారు. కేరళ కన్నీటిని తుడవాలి. మానవతా దృక్పథంతో ప్రతిఒక్కరూ తమవంతు సాయం అందించి బాధితులను ఆదుకోవాలి. ఈ ఆపదసమయంలో ప్రభుత్వాలు, ప్రజలు అందరూ కలసి కేరళ ప్రజలు కోలుకునేందుకు చేయూతనందించాలి.

## కిలారిని పదవి నుంచి తొలగించాలి

### - యాదవమహాసభ నేత డిమాండ్

యాదవులపై అనుచితవ్యాఖ్యలు చేసి అవమానపరచిన జిల్లా గ్రంథాలయసంస్థ ఛైర్మెన్ కిలారి వెంకటస్వామినాయుడును పదవి నుంచి తొలగించాలని, ఆయనపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అఖిల భారతీయ యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు ఎస్‌వి నారాయణయాదవ్ డిమాండ్ చేశారు. జిల్లా యాదవమహాసభ ఆధ్వర్యంలో ఈ నెల 19న నెల్లూరులోని ఏబిఎం నుంచి వీఆర్‌సి సెంటర్‌వరకు మోటార్‌సైకిళ్ళతో ర్యాలీ నిర్వహించి కిలారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పదవిలో ఉంటూ యాదవుల మనోభావాలను కించపరిచేవిధంగా వ్యాఖ్యలు చేయడం విచారకరమన్నారు. ఈ విషయమై టిడిపి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం కూడలిలో రాస్తారోకో నిర్వహించి, కిలారిపై ప్రభుత్వం చర్యలు తీసుకునేలా పాలకులకు బుద్ధిని ప్రసాదించాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం అందజేశారు. వేణుయాదవ్, సురేంద్ర, వెంకట్రావ్, నాగేశ్వరరావు, వెంకటరమణయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ళు కూల్చొద్దు

### - రైల్వే అధికారులకు హైకోర్టు ఆదేశాలు

రైల్వే ట్రాక్ ప్రక్కన ఉన్న ఇళ్ళను కూల్చొద్దని, తీర్పు వచ్చే వరకు యథాతథంగా ఉంచాలని హైకోర్టు రైల్వే శాఖాధికారులకు ఆదేశాలు జారీ చేసింది. నెల్లూరు నగరంలో రైల్వేలకు చెందిన స్థలంలో దాదాపు నాలుగు వేల ఇళ్ళు ఉన్నాయి. నెల్లూరు నగరంలోని వెంకటేశ్వరపురం నుంచి వేదాయపాళెం వరకు వేలాది మంది రైల్వే స్థలాల్లో గడిచిన 30ఏళ్ళుగా అక్కడే నివసిస్తూ ఇంటి పన్ను మొదలుకుని కరెంటు బిల్లుల వరకు అన్నీ అధికారికంగా చెల్లిస్తున్నారు. ఈ క్రమంలో విజయవాడ నుంచి చెన్నై వరకు మూడో లైను నిర్మించాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. విజయవాడ నుంచి చెన్నై వరకు మూడో లైను ఏర్పాటుకు జిల్లాలో కావలి నుంచి తడ వరకు దాదాపుగా 170 కిలోమీటర్ల పొడవునా మూడో రైల్వే లైన్ నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇందు కోసం ప్రధానంగా నదుల సమీపంలో పెద్ద బ్రిడ్జిల ప్రాంతాల్లో పనులను ప్రారంభించారు. అందులో భాగంగా నెల్లూరు పెన్నా బ్రిడ్జి వద్ద మూడోలైను రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి పనులు చేస్తున్నారు. అయితే రైల్వే లైను వెంబడి నివసించే నివాసితులకు ఈ ఏడాది జూన్‌లో రైల్వే అధికారులు ఖాళీ చేయాలని నోటీసులిచ్చారు. నిరుపేద కుటుంబాలు కావడంతో ఎలాంటి ప్రత్యామ్నాయం చూపకుండా ఖాళీ చేయమని ఆదేశాలు జారీ చేయడంతో నివాసితులు కట్టుబట్టలతో రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ వారికి బాసటగా నిలిచారు. ఈ క్రమంలో వ్యవహారం రాజకీయ రంగు పులుముకోవడంతో అధికార పార్టీ నేతలు సానుభూతి వ్యక్తం చేయడానికి నివాసితుల ఇళ్ళ వద్దకు వెళ్ళి అంతా తాము చూసుకుంటామని చెప్పి ముఖం చాటేసి వెళ్ళిపోయారు. కోర్టులో కేసు ఉండడంతో ప్రస్తుత యథాస్థితి కొనసాగుతోంది.




## అటల్‌జీ పేరు పెట్టాలి

కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్న పోలవరం ప్రాజెక్టుకు మాజీప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి పేరు పెట్టాలి. ఆయన పేరును ఈ ప్రాజెక్టుకు పెట్టడంలో ఎలాంటి తప్పు లేదు. దేశంలో అన్ని పథకాలు, ప్రాజెక్టులకు నెహ్రూ కుటుంబీకుల పేర్లే పెట్టారు. దేశానికి ఆయన చేసిన సేవలను దృష్టిలో పెట్టుకుని పోలవరంకు వాజ్‌పేయి పేరు పెట్టాలి.

**- డి.రామ్మోహన్, నెల్లూరు.**

## నెల్లూరులో వైసిపి కంచె

వైకాపా శ్రేణులు జిల్లా నలువైపులా శత్రుదుర్భేద్యం చేసాయి. నెల్లూరు నగర కోట అనిల్‌ది, పడమరాన మేకపాటి, దక్షిణాన ఆనం, నేదురుమల్లి, ఉత్తరాన నల్లపరెడ్డి ప్రసన్న, రాంప్రతాప్‌లతో పార్టీ బలంగా వుంది. నెల్లూరురూరల్, సర్వేపల్లిలో శ్రీధర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డిలు సమర్థసైన్యాధ్యక్షులై వున్నారు. ఈ ఊపు కొనసాగితే నెల్లూరుజిల్లాలో పది స్థానాలూ కడపరెడ్డివే!

**వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

## చంద్రబాబు సీనియార్టీ ఇదేనా?

మాజీప్రధాని వాజ్‌పేయి వల్ల రాజకీయంగా లబ్దిపొందిన వారిలో చంద్రబాబునాయుడు ఒకరు. 1999 ఎన్నికల్లో వాజ్‌పేయి సానుభూతి దేశమంతటా పనిచేసింది. ఆ ఎన్నికల్లో బీజేపీతో పొత్తు వల్లే ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి కాగలిగాడు. అలాంటి వాజ్‌పేయి మరణిస్తే కనీసం ఆరోజున సెలవు కూడా ప్రకటించకుండా చంద్రబాబు తన దుర్మార్గపు బుద్ధిని చాటుకున్నాడు. వాజ్‌పేయి మీదున్న గౌరవంతో రాజకీయంగా ఆయనతో అంతగా అనుబంధం లేని తమిళనాడు సీఎం పళనిస్వామి, తెలంగాణ సీఎం కేసీఆర్‌లే తమ తమ రాష్ట్రాల్లో సెలవు ప్రకటించారు. రాష్ట్రంలో పనికిమాలిన కార్యక్రమాలన్నింటికి సెలవులిచ్చే ముఖ్యమంత్రికి మహానేత వాజ్‌పేయి మృతికి సంతాపసూచకంగా సెలవు ఇవ్వాలన్న జ్ఞానం లేకపోవడం శోచనీయం.

**పత్రంగం నగేష్, నాయుడుపేట.**

## ప్రకృతితో ఆడుకోవద్దు!

చరిత్రలో కనీవినీ ఎరుగని వరదలతో కేరళ అల్లాడుతోంది. ప్రకృతి సోయగాలతో అలరారే రాష్ట్రం, పచ్చని చెట్లు, సెలయేర్లతో అందంగా ఉండే రాష్ట్రం. అలాంటి రాష్ట్రంలో ఇంతటి వరదలేంటి? కారణం అక్కడ కూడా మైనింగ్ మాఫియా. లక్షల టన్నుల ఖనిజాలను తవ్వి తరలించేసారు. ప్రకృతిని చెరబట్టబట్టే వరదలతో ఆ రాష్ట్రం అతలాకుతలమైపోతుందని నిపుణుల అంచనా!

**జాదేవ్, నెల్లూరు.**

# ఎవరైనా ఒక్క బొల్లినేనే?



ఆత్మకూరు తెలుగుదేశం పార్టీ తెరపైకి అనూహ్యంగా బొల్లినేని కృష్ణయ్య దూసుకువచ్చాడు. ఒక బొల్లినేని తెరమీదకు వస్తే ఇంకో బొల్లినేని తెర చాటుకు పోక తప్పదా? అనే చర్చ ఇప్పుడు జిల్లాలో నడుస్తోంది.



నిజమే... జిల్లాలో సామాజిక సమీకరణల కోణంలో టిక్కెట్ల కేటాయింపు వుంటుంది. తెలుగుదేశం పార్టీలో 2014లో కమ్మ సామాజికవర్గీయులకు మూడు సీట్లిచ్చారు. వాళ్లలో ఇద్దరు గెలిచారు. 'రెడ్ల' ప్రాబల్యం అధికంగా వున్న జిల్లాలో ఈసారి 'కమ్మ' వర్గానికి రెండు సీట్లివ్వాలని, రెడ్లకు ప్రాధాన్యతనివ్వాలనే అభిప్రాయం పార్టీ వర్గాలలోనే వ్యక్తమవుతోంది. ఆత్మకూరు బొల్లినేని కృష్ణయ్యకు ఇస్తే వెంకటగిరి లేదా ఉదయగిరిలలో ఒక సీటును ఈసారి 'రెడ్డి' వర్గానికి కేటాయించే అవకాశాలున్నాయి. వెంకటగిరిలో చూస్తే కురుగొండ్ల రామకృష్ణ కంటే గట్టి అభ్యర్థి పార్టీలో కనిపించడం లేదు. అతనిపై వ్యతిరేకత వున్నా ఎలక్షన్‌లో గట్టిగా నిలబడేది అతనేననే పేరుంది. కాబట్టి ఆయనను పక్కన పెట్టడం కష్టమే! ఇక ఆప్షన్ వుండేది ఉదయగిరే! 'రెడ్ల' ప్రాబల్యం వున్న నియోజకవర్గం. సిట్టింగ్ ఎమ్మెల్యే బొల్లినేని రామారావుపై ప్రజల్లో తెలియని వ్యతిరేకత వుంది. ఆయన పనులు చేయకనో, అవినీతి కుంభకోణాల వల్లనో ఈ వ్యతిరేకత కాదు... కార్యకర్తలకు అన్యాయం చేసిన దాని వల్లా కాదు! కేవలం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో వుండడు, నియోజకవర్గంలో జరిగే పెళ్ళిళ్ళు, కర్మంత్రాలకు రాడు అన్నదే ఆయనపై వ్యతిరేకతకు కారణం. అంటే ఉదయగిరి ప్రజల మైండ్‌సెట్‌కు తగ్గట్లుగా ఆయన సెట్ కాలేకపోతున్నాడు. రేపు టిక్కెట్ కోసం ఆయన గట్టిగా పట్టుబట్టడం లేదు. సీటు తనకిచ్చినా పోటీ చేస్తాడు, ఇంకెవరికిచ్చి పని చేయమన్నా చేస్తాడు. బొల్లినేనికి ప్రత్యామ్నాయంగా 'రెడ్డి' వర్గం నుండి కావ్య కృష్ణారెడ్డి ప్రధానంగా టిక్కెట్ రేసులో వున్నాడు. అలాగే మరో ఇద్దరు వ్యాపారవేత్తలు కూడా ఉదయగిరి టిడిపి సీటు కోసం బలంగా ప్రయత్నాలు సాగిస్తున్నట్లుగా తెలుస్తోంది.

ఆత్మకూరు సీటు బొల్లినేని కృష్ణయ్యదైతే మాత్రం బొల్లినేని రామయ్యకు ఉదయగిరి డౌటే!



# ఉండేదెవరు.. పోయేదెవరు... వచ్చేదెవరు?

## • వేగం పెంచిన సైకిల్

**తెలుగుదేశం పార్టీ ఇప్పటికీ బలం పుంజుకోని జిల్లాల్లో నెల్లూరు ప్రథమంగా కనపడుతుంది. ఏ జిల్లాలో లేని విధంగా నెల్లూరుజిల్లాలోనే గెలుపు గుర్రాల సమస్య ఆ పార్టీని వెంటాడుతోంది. ముఖ్యంగా ఎవరు పార్టీలో నిలబడతారు? ఎవరు వస్తారు? ఎవరు బయటకు పోతారన్నదానిపై ఆ పార్టీలో స్పష్టత రాలేకపోతోంది. ఎవరన్నా ఒక గట్టినాయకుడు బయటకుపోతేనే దానివల్ల ఏర్పడే లోటును భర్తీ చేసుకోవడానికి నానా పాట్లు పడాల్సివస్తోంది.**

జిల్లాలో లోక్‌సభకు గాని పది అసెంబ్లీ స్థానాలకు గాని ఈ సీటు ఫలానా నాయకుడిది అని స్పష్టంగా చెప్పే పరిస్థితి జిల్లా తెలుగుదేశం పార్టీలో లేదు. మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి టీడీపీని వీడడంతో ఏర్పడ్డ లోటును భర్తీ చేసుకోవడానికి ఆ పార్టీ నాయకత్వం పెద్ద కసరత్తే చేయాల్సి వచ్చింది. ఆనం పార్టీని వీడడంతో ఆత్మకూరు టీడీపీలో వర్గవిభేదాలు తలెత్తడం తెలిసిందే! ఇనఛార్జ్ కోసం గూటూరు కన్నబాబు గొడవ చేసినా ఆయనను పక్కనపెట్టి నెల్లూరు పార్లమెంట్‌కు, నెల్లూరు రూరల్‌కు ఇన్‌ఛార్జ్‌గా వున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డికే ఆత్మకూరు ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఆత్మకూరులో పార్టీని లేపడం కోసం ఆయన ఇటీవల బాగానే తంటాలుపడ్డాడు. అయితే ఆయన ఆత్మకూరు అభ్యర్థి కాదు... కన్నబాబు సరిపోడు... మాజీఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు చూస్తే నాయకుడిగా ఓకేగాని ఆర్థికంగా సరితూగలేడు. ఇక వున్న మార్గం మాజీఎమ్మెల్యే బొల్లినేని కృష్ణయ్యను రంగంలోకి దించడం. చంద్రబాబు స్థాయిలో ప్రయత్నాలు సాగించి ఎట్టకేలకు బొల్లినేని కృష్ణయ్యను రంగంలోకి దించడానికి ఒప్పించారు. అన్నింటికంటే పెద్ద సమస్య లోక్‌సభ అభ్యర్థిపై క్లారిటీ రాకపోవడం. ఆదాల ప్రభాకర్‌రెడ్డి లోక్‌సభకు పోటీ చేస్తాడా? లేక అసెంబ్లీకి పోవాలనుకుంటున్నాడా? అందులో ఏ అసెంబ్లీ స్థానం... నెల్లూరురూరలా? కావలా? కోవూరా? ఇవన్నీ కాకుండా అసలు పార్టీయే మార తాడా? ఆదాలను ఆధారం చేసుకుని కనీసం మూడు స్థానాల అభ్యర్థుల ఎంపిక జరగాలి. ఆదాల కాకుంటే పార్లమెంట్‌కు అభ్యర్థిగా ఎవరిని పంపాలి? ఆదాల పార్టీలో వుంటే సరే... పార్టీని వదిలిపోతే నెల్లూరు లోక్‌సభ, రూరల్ అభ్యర్థులు ఎవరు? సూళ్ళూరుపేటలో పరసాను కొనసాగించడమా? ఆయన పట్ల వున్న వ్యతిరేకత దృష్ట్యా కొత్త అభ్యర్థిని రంగంలోకి దించడమా? గూడూరులో సిటింగ్ ఎమ్మెల్యే పాశం సునీల్‌కు సీటు ఇవ్వక తప్పని పరిస్థితి. ఆయనపై వ్యతిరేకత వున్నా తప్పదు. మంత్రి నారాయణ పోటీ చేస్తాడా? చేస్తే ఒక స్థానంలో అభ్యర్థి లోటు తీరినట్లే! చేయకపోతే ఇంకో గట్టి నాయకుడి కోసం వెదుకులాట తప్పదు. సిటింగ్ ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, బొల్లినేని రామారావు, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి లపై ప్రజల్లో వ్యతిరేకత వుంది. అయినా కూడా వాళ్ళకే సీట్లిస్తారా? వారి స్థానాలలో కొత్త అభ్యర్థులను తెస్తారా?

ఇలా ఎన్నో ప్రశ్నలకు నెల్లూరుజిల్లా తెలుగుదేశంపార్టీ వేదికయ్యింది. ఒక్కో ప్రశ్నకు చిక్కుముడి విప్పుకుంటూ సమాధానం చెప్పే దిశగా జిల్లా దేశం నాయకులు ఇప్పుడిప్పుడే వేగంగా పావులు కదపడం మొదలుపెట్టారు.

# వియస్‌యు విద్యార్థులకు అండగా జనసేన


వియస్‌యు విద్యార్థి సమాఖ్య సభ్యులతో మాట్లాడుతున్న మనుక్రాంత్

విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో జనసేన ముందుంటుందని ఆ పార్టీ నాయకులు చెన్నారెడ్డి మనుక్రాంత్ పేర్కొన్నాడు. ఇటీవల నెల్లూరు మినీబైపాస్‌రోడ్డులోని జనసేన కార్యాలయంలో వియస్‌యు విద్యార్థి సమాఖ్య, భగత్‌సింగ్ స్టూడెంట్ యూనియన్ నాయకులతో మనుక్రాంత్ సమావేశమయ్యాడు. ఈ సందర్భంగా వియస్‌యు విద్యార్థులు గతంలో తాము జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ వద్దకు చేసిన పాదయాత్ర, ఆయన చొరవతో యూనివర్శిటీని నూతన క్యాంపస్‌కు మార్చడం, యూనివర్శిటీ అవినీతి కార్యక్రమాలపై ఆనాడు మంత్రి గంటా శ్రీనివాసరావు ఇచ్చిన హామీల అమలులో వైఫల్యం వంటివి చర్చించారు. అలాగే త్వరలో నెల్లూరులో ప్రజాపోరాటయాత్ర చేయబోతున్న పవన్‌కళ్యాణ్‌కు జిల్లా విద్యార్థి లోకం అండగా ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా మనుక్రాంత్ మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్ జోక్యంతోనే విక్రమ సింహపురి యూనివర్శిటీలో ఎన్నో సమస్యలు పరిష్కారం కావడం హర్షణీయమని, పవన్ ప్రశ్నించబట్టే ఆనాడు మంత్రి గంటా శ్రీనివాసరావు హడావిడిగా నెల్లూరుకు పరుగెత్తి యూనివర్శిటీ అక్రమాలపై విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశాడు. వర్శిటీలో అవినీతి ప్రక్షాళనే లక్ష్యంగా జనసేన పోరాడుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు జొన్నలగడ్డ సుధీర్, మల్లి శ్రీకాంత్‌యాదవ్, కె.గంగిరెడ్డి, గండి కిరణ్‌కుమార్, నెల్లూరు వినయ్‌కుమార్, వైభవ్, చంద్ర, శివ తదితరులు పాల్గొన్నారు.


# బలపరీక్షకు సిద్ధమైన అజీజ్



వచ్చే ఎన్నికల్లో నెల్లూరు నగరం టీడీపీ టిక్కెట్‌ను ఆశిస్తున్న వారిలో మేయర్ అబ్దుల్ అజీజ్ మొదటి వరుసలో వున్నాడు. టిక్కెట్ పోరులో గట్టిగా నిలబడాలంటే చంద్రబాబుకు తన బలం చూపించాలి. అలా ఆయన బలనిరూపణకు ఓ అవకాశం వచ్చింది. ఈ నెల 28న గుంటూరులో 'నారా హమారా – టీడీపీ హమారా' పేరుతో మైనార్టీ సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ సదస్సుకు భారీగా తన అనుచరులను తరలించి చంద్రబాబు సమక్షంలో తన సత్తా చాటాలని అజీజ్ భావిస్తున్నాడు. ఇందుకోసమే నెల్లూరు నుండి దాదాపు 50బస్సులు, ఇతర వాహనాలలో ముస్లింలను గుంటూరుకు తీసుకెళ్లడానికి సన్నాహాలు చేసాడని తెలుస్తోంది.

# ముచ్చటగా మూడోసారి!

## బీజేపీ జిల్లా బాధ్యతలు సురేంద్రకే!



భారతీయ జనతాపార్టీ జిల్లా అధ్యక్షుడిగా వరుసగా మూడోసారి పి.సురేంద్రరెడ్డినే ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ నియమించాడు. సురేంద్రరెడ్డి వివాదాస్పద నాయకుడు కాదు, పార్టీలో ఎవరితోనూ విభేదాలు లేవు. ఆయనను తొలగించి ఆ పదవి మాకివ్వాలని కోరే వాళ్ళు కూడా పార్టీలో లేరు. అందరితో సర్దుకుని, కలుపుకునిపోతున్నాడు. అందుకే మూడోసారి కూడా పార్టీ జిల్లా బాధ్యతలను ఆయనకే కట్టబెట్టారు.

## డీసీసీబీ పాలకవర్గ పదవీకాలం

# మరో 6నెలలు పొడిగింపు



జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పాలకవర్గం పదవీ కాలాన్ని మరో 6 నెలలు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో బ్యాంకు పాలకవర్గం పదవీ కాలం ముగియగా ప్రభుత్వం 6 నెలలు పొడిగించింది. ఈనెల 18వతేదీతో ఆ 6 నెలలు పూర్తి కాగా ప్రభుత్వం ఇంకో 6 నెలలు పొడిగిచింది. దీంతో 2019 ఫిబ్రవరి దాకా ప్రస్తుత పాలకవర్గం పనిచేయనుంది.




# నెల్లూరు కబుర్లు

## వదలనంటున్న సూరన్న



కేరళలో వరదలు... కర్నాటకలో వరదలు... గుంటూరు నుండి శ్రీకాకుళం దాకా భారీ వర్షాలు... గోదావరి, కృష్ణానదుల పరవళ్ళు... అదేం దరిద్రమో నెల్లూరుజిల్లాను మాత్రం ఎండలు వదిలిపోనంటు న్నాయి. అప్పుడప్పుడు తుంపర్లు తప్పితే భారీ వర్షాల జాడలే లేవు. పెన్నానది ఎడారిని తలపిస్తోంది. బావులు, బోర్లు అడుగంటిపోయి బురదనీళ్లొస్తున్నాయి. నెల్లూరు నగరంలోని పెన్నా తీర ప్రాంతాలైన రంగనాయకులపేట, స్టోన్‌హౌస్‌పేట, నవాబుపేట, కిసాన్‌నగర్, జాకీర్‌హుస్సేన్‌నగర్, నవలాకులతోట వంటి ప్రాంతాల్లో కూడా బోర్లు ఎండిపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. నగరంలో ఎక్కడ నీటి ఎద్దడి ఏర్పడ్డా ఈ ప్రాంతాలలో మాత్రం నీటికి కరువుండేది కాదు. కాని ఈసారి ఆ పరిస్థితి ఏర్పడింది. ఎండలు ఇంకా మిడిమేళంగా కాస్తూనే వున్నాయి. మిగతా చోట్ల ఇక వర్షాలు చాలురా అనే పరిస్థితి... నెల్లూరులో మాత్రం ఇక ఈ ఎండలను భరించలేం అనే దుస్థితి.

## రాజీవ్‌కు నివాళి



రాజీవ్‌గాంధీకి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

దివంగత మాజీప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని పురస్క రించుకుని 20వ తేదీ నెల్లూరు ఏ.సి.సుబ్బారెడ్డి స్టేడియం వద్ద గల ఆయన విగ్రహానికి జిల్లా కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీసీసీ అధ్య క్షులు పనబాక కృష్ణయ్య ఆధ్వ ర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సి.వి.శేషా రెడ్డి, చేవూరు దేవకుమార్‌రెడ్డి, పి.చెంచలబాబుయాదవ్, ఉడతా వెంకట్రావ్, పత్తి సీతారాంబాబు, రఘురామ్ ముదిరాజ్, అనురాధా రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఇందిరాభవన్‌లోనూ రాజీవ్ చిత్రపటం పెట్టి నివాళులర్పించారు.

## సబ్‌రిజిస్ట్రార్ మానవత్వం



'ఇప్పటివరకు మనం లంచం కోసం పీడిస్తున్న సబ్‌రిజిస్ట్రార్', 'ఏసిబి వలలో సబ్‌రిజిస్ట్రార్' అనే వార్తలే చూసుంటాం. అందరు సబ్‌రిజిస్ట్రార్‌లను ఒకే గాటన కట్టేయలేం కదా! కేరళ వరద బాధితుల దయనీయ స్థితి చూసి చలించిపోయాడు నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట సబ్‌రిజిస్ట్రార్ షరీల్‌బాబు. తాను సొంతంగా లక్ష రూపాయలు ఇవ్వడమే కాకుండా స్నేహితులు, డాక్యుమెంట్ రైటర్ల నుండి మరో 9లక్షల రూపాయలు సేకరించారు. వీటితో దుస్తులు, వంటసామాగ్రి, నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసి కేరళకు పంపించి తన మానవత్వం చాటుకున్నారు.

## కృష్ణాష్టమి పోటీల్లో విజేతలు వీరే...

- మందిరం ఛైర్మెన్ శుకదేవస్వామి

శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా నెల్లూరులోని ఇస్కాన్ మందిరంలో చిన్నారులకు జరిగిన వివిధ పోటీల్లో విజేతల పేర్లను ఇటీవల మందిరం ఛైర్మెన్ శుకదేవస్వామి ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్లేక్లాస్ నుంచి యుకెజి విభాగంలో జరిగిన ఫ్యాన్సీడ్రెస్ పోటీల్లో వరుసగా రాధా దామోదరదాస్, సిహెచ్ తనీష్, కీర్తన ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా, గ్రూప్-2 విభాగంలో (ఫస్ట్, సెకండ్ క్లాసులు) ప్రద్యుమ్న, భూతల్, కౌస్తుభ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారని, 3 నుంచి 5వ తరగతి వరకు నిర్వహించిన కలరింగ్ పోటీల్లో హార్యారెడ్డి, దీపిక, జె.నర్మిత ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలు సాధించగా, 5 నుంచి 7వ తరగతి వరకు (గ్రూప్ -2) కలరింగ్ పోటీల్లో కె.సమీర్, హంసనందన, పి.పుందన కౌషికి వరుసగా ప్రథమ-ద్వితీయ-తృతీయస్థానాలు సాధించారని పేర్కొన్నారు. చిత్రలేఖనం పోటీల్లో కీర్తన, కె. వంశిక, ఎస్. గౌతమచంద్ర బహుమతులు గెలుచుకోగా, పాటల పోటీల్లో ఏ.మేహా, ఆర్‌ఎస్ భవ్యశ్రీ, కె.చకిత, శ్లోకపఠనంలో జయవర్ధన్, పిఎల్‌వి కృష్ణసాయి, ఎం.హారిక బహుమతులు సాధించారని ఆయన వివరించారు.

## ఏసిబి డిఎస్పీగా దేవాంగన్



బాధ్యతలు స్వీకరిస్తున్న దేవాంగన్‌శాంతో

నెల్లూరు ఏసిబి డిఎస్పీగా చంద్ర వంశం దేవాంగన్ శాంతో 20వ తేదీ తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరిం చారు. ఇంతకుముందు ఇక్కడ డిఎస్పీగా వున్న పరమేశ్వరరెడ్డి పదోన్నతిపై నెల్లూరు అడ్మిన్ ఏఎస్పీగా బదిలీ కావడం తెలి సిందే! గుంటూరులో పని చేస్తున్న శాంతోను నెల్లూరు ఏసిబికి బదిలీ చేసారు. 1989 బ్యాచ్‌కు చెందిన దేవాంగన్ శాంతో విశాఖ పట్నంలో ఎస్‌ఐగా విధులు మొదలు పెట్టారు. గతంలో విజయవాడ ఏసిబి సిఐగాను, శ్రీకాకుళం జిల్లా పాలకొండ డిఎస్పీగాను, ఒంగోలులో ఇన్‌ఛార్జ్ డిఎస్పీగాను పనిచేశారు. ఏసిబిలోనే దాదాపు 9ఏళ్ళ పాటు పనిచేసిన అనుభవం వుంది. అయితే నెల్లూరుజిల్లాలో ఇదే ఆయనకు మొదటి పోస్టింగ్. జిల్లాలో అవినీతి అంతానికి తనవంతు కృషి చేస్తానంటున్నాడు ఏసిబి డిఎస్పీ శాంతో... బెస్టాఫ్ లక్ సార్!

## అజాతశత్రువు వాజ్‌పేయి

### - విశ్వసాయి విద్యాసంస్థల్లో అటల్‌జీ సంతాపసభ



వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డాక్టర్ ఎన్.సత్యనారాయణ

జననం నుండి మరణం వరకు తన జీవితాన్ని దేశ సేవకు అంకితం చేసిన మహనీయుడు అటల్ బిహారీ వాజ్‌పేయి అని విశ్వసాయి విద్యాసంస్థల ఛైర్మెన్ డాక్టర్ ఎన్.సత్యనారాయణ పేర్కొన్నారు. ఇటీవల నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని విశ్వసాయి కళాశాలలో వాజ్‌పేయి సంతాప సభ నిర్వహించి అధ్యాపకులు, విద్యార్థులు ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎన్.సత్యనారాయణ మాట్లాడుతూ దేశ ప్రగతి కోసం, భద్రత కోసం వాజ్‌పేయి తీసుకున్న నిర్ణయాలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. ఆయన అజాతశత్రువు, రాజకీయాలకతీతంగా అందరూ ఆయనను అభిమానిస్తారు. ఆయన ప్రవేశపెట్టిన సంస్కరణలతోనే దేశం ఎంతో అభివృద్ధి సాధించింది. రాజకీయా లలో నీతి, నిజాయితీ, విలువల గురించి ప్రస్తావన వస్తే ముందుగా గుర్తొచ్చే పేరు వాజ్‌పేయేనని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్, డిజిఎం, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆటో ప్రయాణీకులు ఇక సేఫ్

### --- రైల్వేస్టేషన్ వద్ద ప్రీపెయిడ్ ఆటోబూత్ ---

జిల్లాలో నేర నియంత్రణకు, ట్రాఫిక్ ప్రక్షాళనకు ఎన్నో సంస్కరణలు చేపట్టిన జిల్లా ఎస్పీ రామకృష్ణ నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ నుండి ఆటోలను ఆశ్రయించే ప్రయాణీకుల కోసం ఓ వినూత్న కార్యక్రమం చేపట్టారు. నెల్లూరు ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రధాన రైల్వేస్టేషన్ ముందు ప్రీపెయిడ్ ఆటోబూత్‌ను నిర్మిస్తున్నారు. ఈ బూత్ పరిధిలో ప్రయాణీకుడు పోవాల్సిన ప్రాంతాన్ని బట్టి ముందుగానే డబ్బు చెల్లిస్తే అధిక ఛార్జీల భారం వుండదు. పోలీసులు నిర్ణయించిన ఛార్జీలు మాత్రమే చెల్లిస్తారు. అర్ధరాత్రి, అపరాత్రి అయ్యిందని ప్రయాణీకుల వద్ద అడ్డదిడ్డంగా ఛార్జీలు వసూలు చేసే పని వుండదు. దీనికి తోడు ప్రయాణీకుల వివరాలు పోలీసుల వద్ద రికార్డవుతాయి. అలాగే ఆటోడ్రైవర్ల వివరాలన్నీ పోలీసుల వద్ద వుంటాయి కాబట్టి ఆటోలను దారిమళ్ళించడం, ప్రయాణీకులను దోచుకోవడం లేదా ఇతర అకృత్యాలకు పాల్పడడం వంటివి వుండవు. వచ్చే నెలలో ఈ ప్రీపెయిడ్ ఆటోబూత్‌ను ప్రారంభించనున్నారు.

## యోగా అసోసియేషన్ కొత్త కార్యవర్గం

ఈ నెల 19న నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన యోగా అసోసి యేషన్ సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు కె.మనోహరం మాట్లాడుతూ, అధ్యక్షునిగా చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, కార్యదర్శిగా వేణుగోపాల షణ్ముగసెల్వం, కోశాధి కారిగా షేక్ ఖయ్యూంలతో పాటు కార్యవర్గసభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిం దన్నారు. ప్రజల్లో యోగాపై ఆసక్తిని పెంచేలా కొత్తకార్యవర్గం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ యోగా శిక్షకుడు జి.వెంకటేశ్వర్‌రావు, ఒలంపిక్ అసోసియేషన్ కోశాధికారి పసుపులేటి రామ్మూర్తి పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 8-9 తేదీల్లో

### నవ్యాంధ్ర రచయితల సంఘం

## ఆవిర్భావ వేడుకలు

- చిన్ని నారాయణరావు

'రచయితల సంక్షేమం-నవ్యాంధ్ర పురోభివృద్ధిలో సలహాల భాగస్వామ్యం' నినాదంతో ఆవిర్భవించిన నవ్యాంధ్ర రచయితల సంఘం ఆవిర్భావ సభలు సెప్టెంబర్ 8-9 తేదీల్లో విజయవాడలో ఎంతో ఘనంగా జరుగనున్నాయని ఆ సంఘం సిఇఓ, ప్రముఖ కవి చిన్ని నారా యణరావు తెలియజేశారు. ఈ రెండు రోజుల కార్యక్రమంలో తెలుగుభాష మరియు సామాజికాంశాలపై మూడు వందల మంది కవుల కవితాగానంతో '300 కవితల పండుగ' జరుగనుందని, ఇంకా పుస్తకావిష్కరణలు, వివిధ ప్రక్రి యల్లో నిష్ణాతులైన రచయితలు, కవులచే చిరుప్రసంగాలు, నిరంతర సాహిత్యసేవ చేస్తూ గుర్తింపులేక మరుగునపడ్డ సాహి తీవేత్తలకు సత్కారాలు ఉంటాయన్నారు. 300 కవితల పండుగలో పాల్గొనదలచిన వారు తమ పేర్లను వెంటనే నమోదు చేసు కోవాలని కోరుతున్నామన్నారు. వివరాలకు 92464 15150, 83744 39053 నెంబర్లను సంప్రదించవచ్చని ఆయన వివరించారు.

## రూరల్ మహిళా ఇన్‌ఛార్జ్‌గా కవిత



నెల్లూరుజిల్లా, నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని శ్రీమతి చేజర్ల కవి త ని నెల్లూరు రూరల్ నియోజక వర్గం మహిళా ఇన్‌ఛార్జ్‌గా నియమిస్తు న్నట్లు నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఒక పత్రికా ప్రకటనలో తెలియ జేశాడు. తనకు ఈ పదవి రావడానికి కారణమైన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి కవిత కృతజ్ఞతలు తెలిపారు.

## ఏసిపిగా ఆనందరావు

నెల్లూరు నగరపాలక సంస్థ అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా ఆనందరావు 20వ తేదీ బాధ్యతలు స్వీకరించారు. అమలాపురం మున్సిపాల్టీలో విధులు నిర్వహిస్తున్న ఆయనను నెల్లూరుకు బదిలీ చేయడం జరిగింది. గతంలో ఇక్కడ ఏసిపిగా వున్న మణిరత్నం లంచం తీసుకుంటూ ఏసిబికి పట్టుబడటంతో రెండు నెలలుగా ఈ పోస్టు ఖాళీగా వుంది. ఎట్టకేలకు ఆనంద రావుతో భర్తీ చేశారు.

## 26న జిల్లా బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

ఈ నెల 26వ తేదిన జూనియర్ బాల బాలికల బాల్‌బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక లను నిర్వహిస్తున్నామని బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.మురళీకృష్ణా రెడ్డి తెలియజేశారు. నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో ఆరోజు ఉదయం 9గంటలకు ప్రారంభమయ్యే ఈ ఎంపి కలో పాల్గొనదలచినవారు వయసు, ధృవీ కరణ పత్రం, ఆధార్‌కార్డుతో పాటు యూనిఫాంతో రావాలని ఆయన కోరారు.



# చెత్తనగరి... సింహపురి!

'స్వచ్ఛ సర్వేక్షణ్' అంటూ మున్సిపల్ మంత్రి నారాయణ, మేయర్ అజీజ్‌లు ఈమధ్యంతా తెగ కష్టపడ్డారు. 'స్వచ్ఛ సర్వేక్షణ్'లో జాతీయ స్థాయిలో టాప్‌ర్యాంకు తెచ్చుకోవాలని శ్రమించారు. గత ఏడాదిలో పారిశుద్ధ్య పనుల పరంగా ఫర్వా లేదనిపించారు. గతంతో పోలిస్తే నగరంలో పారిశుద్ధ్యం పనులు కొంతవరకు మెరుగయ్యాయనే చెప్పవచ్చు.

అయితే ఏం లాభం... ఒక ఏడాదంతా చేసిన కృషి ఒక్క వారం పారిశుద్ధ్య కార్మికులు సమ్మె చేస్తే చెత్తలో కలిసిపోతుంది. ప్రస్తుతం పారిశుద్ధ్య కార్మికులు 279 జి.ఓకు వ్యతిరేకంగా సమ్మెకు దిగడం తెలిసిందే! కార్మికుల సమ్మెతో నగరంలో ఎక్కడి చెత్త అక్కడ గుట్టలు గుట్టలుగా పోగుబడుతుంది. ఈ నెల 14వ తేదీ నుండి దాదాపు 1100 మంది పారిశుద్ధ్య కార్మికులు సమ్మె చేస్తున్నారు. శాశ్వత పారిశుద్ధ్య కార్మికులతో పాటు 150 మంది తాత్కాలిక కార్మికులు మొత్తం 600మంది కార్మికులే ప్రస్తుతం పారిశుద్ధ్య పనుల్లో పాల్గొంటున్నారు. దీంతో తగిన సిబ్బంది లేక ప్రధాన రహదారులలో తప్పితే సందు గొందుల్లో చెత్తను సేకరించడం లేదు. దీనివల్ల 54డివిజన్‌లలోని కాలనీలు, వీధులలో టన్నుల కొద్దీ చెత్త పేరుకు పోయింది. కార్మికులు సమ్మె విరమిస్తే కాని చెత్తను తొలగించే పరిస్థితి లేదు.

## మంత్రిగారి ఆసుపత్రి కోసం...

# పెద్దాసుపత్రిని పాడుచేస్తారా?

### - కోటంరెడ్డి ఆగ్రహం



ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో చర్చిస్తున్న చాట్ల నరసింహారావు

నారాయణ ఆసుపత్రి అభివృద్ధి కోసం పెద్దాసుపత్రి ప్రగతిని అడ్డుకుంటున్నారని నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ నెల 21వ తేదీన ఆయన జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలోని ప్రసూతి విభాగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ఆసుపత్రి ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ 12మంది డాక్టర్లు ఉండాల్సిన విభాగంలో కేవలం ముగ్గురు డాక్టర్లే వుండడం శోచనీయమన్నారు. ఆసుపత్రిలో తాగడానికి రోగులకు మంచినీళ్ళు కూడా లేవు. కనీసం మరుగుదొడ్లలో కొళాయిలు లేవు. ఆసుపత్రి చూస్తే పైన పటారం లోన లొటారం అన్నట్లుగా వుంది. భవనాలు కనిపిస్తున్నంత అందంగా లోపల వసతులు లేవు. లిఫ్ట్ లేకపోవడంతో గర్భిణీస్త్రీలు మూడు అంతస్థులు ఎలా ఎక్కాలని ఆయన ప్రశ్నించారు. రేడియాలజిస్టులు లేరు, స్కానింగ్ లేదు. మంత్రిగారి నారాయణ వైద్యశాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వాసుపత్రిని నిర్వీర్యం చేస్తున్నారా అని ఆయన ప్రశ్నించారు. సమస్యలు పరిష్కరించే దాకా అక్కడ నుండి కదిలేది లేదని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి భీష్మించుకుకూర్చోవడంతో ఆసుపత్రి అభివృద్ధి కమిటి ఛైర్మెన్ చాట్ల నరసింహ రావు, సూపరింటెండెంట్ రాధాకృష్ణరాజు ఆయన వద్దకు వచ్చి చర్చించారు. కోటంరెడ్డి లేవనెత్తిన అన్ని సమస్యలను కొద్ది రోజుల్లోనే పరిష్కరిస్తామని వారు హామీ ఇవ్వడంతో ఆయన ధర్నా విరమించాడు.

# జగన్‌ను ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యం



కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వైయస్సార్‌సిపి అధినేత వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయడమే ధ్యేయంగా పనిచేస్తామని మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి తనయుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు జిల్లా వెంకటగిరిలోని ఆయన నివాసంలో ఈనెల 18న నేదురుమల్లి అభిమానులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేదురుమల్లి అనుచరులు, అభిమానుల అభీష్టం మేరకు వైయస్సార్సీపీలో చేరుతున్నట్లు తెలిపారు. నేదురుమల్లి అభిమానులు ఇప్పటి నుంచి గ్రామస్థాయిలో వైయస్సార్సీపీని పటిష్టం చేసేందుకు కృషి చేయాలన్నారు. కొన్నేళ్ళుగా అధికార పార్టీ ఆగడాలతో కష్టపడ్డ కార్యకర్తలకు త్వరలో మంచిరోజులు రానున్నాయని తెలిపారు. మన ప్రభుత్వం ఏర్పాటయ్యే రోజు దగ్గరలోనే ఉన్నదన్నారు. సెప్టెంబర్ నెలలో నేదురుమల్లి అభిమానులతో కలిసి విశాఖ జిల్లాలో వైయస్ జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో వైయస్సార్సీపీలో చేరుతున్నట్లు నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి ప్రకటించారు. పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి పట్ల జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న నిబద్ధత నచ్చి పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. పార్టీలో గ్రూపులు లేవని, పార్టీ నిర్ణయమే శిరోధార్యంగా భావించి అభ్యర్థిగా ఎవరిని ప్రకటించినా వారి గెలుపు కోసం అందరం కలిసి పనిచేస్తామన్నారు. డీసీయంయస్ ఉపాధ్యక్షులు కాల్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి. తదితర నాయకులు పాల్గొన్నారు.

# కరువు నివేదికలు సిద్ధం చేయండి

### - అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశం



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు

జిల్లాలో 45 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించినందున త్వరలో కేంద్ర కరువు బృందం జిల్లాలో పర్యటించనున్నదని, అందువల్ల జిల్లాలో కరువుకు సంబంధించిన పూర్తిస్థాయి వివరాలను వారికి తెలియజేసేందుకు అధికారులు నివేదికలను సిద్ధం చేసి, కరువు నివారణకు తగు ప్రతిపాదనలు కూడా సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు అధికారులను ఆదేశించారు. ఈ నెల 20న కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కరువు, గ్రామ దర్శిని అంశాలపై జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత సంవత్సరం కరువు దృష్ట్యా చేపట్టిన పనుల వివరాలను అడిగి, అవసరమైతే ఆ పనులు పూర్తి చేసేందుకు ప్రత్యేక అనుమతులు తీసుకునేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. వ్యవసాయశాఖకు సంబంధించి, నష్టపోయిన రైతుల వివరాలను సేకరించాలన్నారు. కేంద్రబృందం పర్యటించే గ్రామాలను ఎంపికచేసి అన్ని శాఖలపరంగా కరువుకు సంబంధించిన వివరాలను సేకరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను పరిష్కరించేందుకు వెంటనే తగు చర్యలు తీసుకోవాలన్నారు. డిసెంబరు 2018 వరకు నిర్వహించనున్న గ్రామ దర్శినిలో అధికారులు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి గ్రామ అవసరాలు, వ్యక్తిగత అవసరాలను గుర్తించి ప్రాధాన్యతా పరంగా పనులు పూర్తిచేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్-2 శ్రీమతి కమలకుమారి, తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ సదాభార్గవి, డిఆర్‌డిఏ పి.డి రోజ్‌మండ్, సిపిఓ పిబికె మూర్తి, జడ్పీ ఉప కార్యనిర్వహణాధికారి వసుంధర, డ్వామా పి.డి బాపిరెడ్డి, మెప్మా పి.డి చిరంజీవి, సాంఘికసంక్షేమశాఖ డిప్యూటి డైరెక్టర్ మధుసూదన్, వ్యవసాయశాఖ జేడి చంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# ప్రజా సంక్షేమం టిడిపితోనే సాధ్యం

### - మాజీమంత్రి ఆదాల

టిడిపి ప్రభుత్వంతోనే ప్రజలకు సంక్షేమపథకాలు సాధ్యమని నెల్లూరు గ్రామీణ నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి, మాజీమంత్రి ఆదాల ప్రభాకరరెడ్డి అన్నారు. నెల్లూరురూరల్ మండలంలోని దొంతాలి గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులను ఆయన ఈ నెల 19న పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ఆదాల మాట్లాడుతూ, దొంతాలిలో అవసరమైన రహదారుల నిర్మాణం వగైరాలన్నీ పూర్తిచేశామని, గ్రామీణ మండలంలోని అన్ని గ్రామాల్లో పూర్తిస్థాయిలో సిసి రోడ్లు, కాలువల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. చంద్రన్న బీమా, ఎన్టీఆర్ వైద్యసేవ తదితర పథకాల ద్వారా అనేకమంది నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం సాయం అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆదాలతో పాటు విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, టిడిపి సీనియర్



నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, ఆనం జయకుమార్‌రెడ్డి, హరిబాబుయాదవ్, శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఛైర్మెన్ మలినేని వెంకటేశ్వరరావు, స్వర్ణవెంకయ్య పాల్గొన్నారు.



# వైసిపిలోకి 'దేశం' నాయకులు



కోట మండలం అల్లంపాడు గ్రామంలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో పంచాయితీలోని గోవిందపల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు ఉప్పల రఘువీర్, అదే గ్రామానికి చెందిన సుమారు 50 కుటుంబాలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. వీరికి వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి పార్టీ కండువా కప్పి వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలోకి సాదరంగా ఆహ్వానించాడు. ఈ సందర్భంగా పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా తీసుకురాగల సత్తా ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే వుందని, ఆయన మీద నమ్మకంతో రాష్ట్ర ప్రజలు ఆయన చేస్తున్న ప్రజాసంకల్పయాత్రకు తండోపతండాలుగా తరలి వస్తున్నారని, వారితో మమేకమవుతూ యాత్రను దిగ్విజయంగా కొనసాగిస్తున్నారని తెలిపాడు. వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీని గూడూరు నియోజకవర్గంలో బలోపేతం చేసి 2019 ఎన్నికల్లో వై.యస్.జగన్మోహన్‌రెడ్డిని రాష్ట్ర ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాదర్తి రాధాకృష్ణారెడ్డి, దువ్వూరు రమణారెడ్డి, పాదర్తి మధుసూదన్‌రెడ్డి, ఇన్నమల వెంకటాద్రి, ఉప్పల ప్రభాకర్‌గౌడ్, దువ్వూరు సాయికృష్ణారెడ్డి, కృష్ణారెడ్డి సునీల్‌రెడ్డి, పాలగాటి సాయికృష్ణారెడ్డి, నరేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మనుక్రాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో...

# నెల్లూరు జిల్లా జనసేన కార్యాలయం ప్రారంభం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మారిశెట్టి రాఘవయ్య

జనసేన పార్టీ జిల్లా నాయకులు మనుక్రాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అభిమానులు, కార్యకర్తల ఆనందోత్సాహాల నడుమ జనసేన రాష్ట్ర పిఏసి సభ్యులు మారిశెట్టి రాఘవయ్య, రాష్ట్ర కో-ఆర్డినేటర్ పార్థసారధి నెల్లూరు మినీబైపాస్‌రోడ్డు వద్ద జనసేన జిల్లా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. తొలుత జనసేన పార్టీ జెండాను ఆవిష్కరించిన రాష్ట్ర నాయకులు కార్యాలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రాఘవయ్య మాట్లాడుతూ జనసేన యువ నాయకులు మనుక్రాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరులో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించడం అభినందనీయమన్నారు. అట్టడుగువర్గాల అభివృద్ధే జనసేన లక్ష్యమన్నారు. పార్టీ బలోపేతంలో భాగంగా రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో పార్టీ కార్యాలయాలను ప్రారంభిస్తున్నామన్నారు. ప్రతి కార్యకర్త పార్టీ కోసం కష్టపడి పనిచేయాలన్నారు. పార్టీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ పార్థసారధి మాట్లాడుతూ గత నాలుగేళ్ళలో రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమన్నారు. అధికార పార్టీ వైఫల్యాలపై పోరాడాల్సిన ప్రతిపక్షం పత్తా లేకుండా పోయిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రజల్లో తిరుగుతున్నారన్నారు. కాపుల రిజర్వేషన్ల విషయంలో అన్ని పార్టీలు దొంగ నాటకాలు ఆడుతున్నాయని విమర్శించారు. రాష్ట్రంలోని 175అసెంబ్లీ స్థానాల్లోను, 25 పార్లమెంటు స్థానాల్లోను జనసేన పోటీ చేస్తుందన్నారు.

### కేరళ వరద బాధితులకు

# పిఆర్ క్లబ్ చేయూత



ఆర్డీవో అరుణ్‌బాబుకు చెక్కును అందజేస్తున్న పిఆర్ క్లబ్ సభ్యులు గోపాల్‌రెడ్డి, రామ్మోహన్‌రావు

గూడూరు పట్టణంలోని పిఆర్ క్లబ్ ఆధ్వర్యంలో కేరళ వరద బాధితుల సహాయార్థం లక్ష రూపాయలను ఆర్డీవో అరుణ్‌బాబుకు సభ్యులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, శ్రీకంటి రామ్మోహన్‌రావు ఈనెల 20వ తేదీ అందజేశారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి, రామ్మోహన్‌రావు మాట్లాడుతూ గత నూరేళ్ళుగా కేరళ రాష్ట్రంలో ఇంతవరకు ఇలాంటి ఉత్పాతం జరగలేదని చెప్పారు. కేరళలో జనజీవనం స్థంభించిపోయిందని, ప్రతి ఒక్కరూ మానవతాదృక్పథంతో ప్రజలను ఆదుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ మెంబర్లు వీరిబోయిన గోపాలకృష్ణ యాదవ్, జనార్ధన్‌రెడ్డి, మస్తాన్‌రెడ్డి, రఘురామయ్య, రమణయ్య, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# తక్షణమే వివాహ నమోదు పత్రాలు



నవదంపతులకు వివాహ ధ్రువీకరణ పత్రాన్ని

వివాహం చేసుకున్న నవ వధూవరులకు వివాహ నమోదు పత్రాలను ఎటువంటి ఆలస్యం లేకుండా త్వరితగతిన అందజేస్తామని గూడూరు పురపాలక ఛైర్మెన్ పొణకా దేవసేన తెలిపారు. గూడూరు పట్టణంలోని పురపాలక కార్యాలయంలో నూతనంగా వివాహం అయిన వధూవరులకు వివాహ నమోదు ధ్రువీకరణ పత్రాన్ని సోమవారం ఛైర్మెన్‌పర్సన్ దేవసేన, కమిషనర్ ఓబులేసు అందజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గూడూరు ప్రాంతానికి చెందిన సుబ్రహ్మణ్యం, మంగమ్మలు వివాహం చేసుకొని వివాహ ధ్రువీకరణ పత్రం కోసం పురపాలక కార్యాలయంలో నమోదు చేసుకున్నారని, వారికి వివాహ ధ్రువీకరణ పత్రాన్ని అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో పురపాలక అధికారులు శ్రీహర్షిత, పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# సమాజంలో దోచుకోలేనిది చదువు మాత్రమే

### - ఏసీబీ డిఎస్పీ తోట ప్రభాకర్



విద్యార్థులకు నగదు పురస్కారాన్నందజేస్తున్న ఏసిబి డిఎస్పీ ప్రభాకరరావు

సమాజంలో దోచుకోలేనిది ఒక్క చదువు మాత్రమేనని, ప్రతి ఒక్కరూ కష్టపడి ఇష్టంతో చదివితే జీవితాంతం వెలుగు వస్తుందని ఏసీబీ డిఎస్పీ తోట ప్రభాకర్ తెలిపారు. గూడూరు పట్టణం విశ్రాంత ఉద్యోగుల భవనంలో గూడూరు డివిజన్ గౌడ్ విద్యా సేవాసమితి ఆధ్వర్యంలో పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికాన్ని జయించాలంటే ఏకైక మార్గం చదువు మాత్రమేనని స్పష్టం చేసారు. చదువుకున్న విలువ, గౌరవం తెలుసుకుని చిన్నతనం నుంచి క్రమం తప్పకుండా చదువుకుంటే ఉన్నతస్థాయికి ఎదుగుతారని, గెలుపు ఓటములు సహజమని, ఎప్పుడూ అధైర్యపడరాదన్నారు. ప్రతి విషయంలోనూ మంచిని స్ఫూర్తిగా తీసుకుని ధైర్యంగా ముందుకు సాగాలని కోరారు. కుటుంబంలో చదువుకుంటే జీవన స్థితిగతులే సంపూర్ణంగా మారిపోతాయని సూచించారు. అనంతరం ఉత్తమ ఫలితాలు పొందిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు వాసుగౌడ్, డాక్టర్ నవీన్, జాహ్నవి, ధనుంజయగౌడ్, నాశిన నాగులు, సుబ్రహ్మణ్యం, సుధాకర్, నారాయణ, మునిశేఖర్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోనే ఉన్నత శిఖరాలు



పాఠశాలకు సౌండ్ సిస్టమ్ అందజేస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

గూడూరు మండలం చవటపాలెం ఉన్నతపాఠశాలకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మైక్, సౌండ్ సిస్టమ్‌ను సీనియర్ రొటేరియన్, దాత పెనుబోలు రామకృష్ణారెడ్డి మనుమడు రేవాన్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 20వ తేదీ అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ కె.మునిగిరీష్ పాల్గొని మాట్లాడుతూ పాఠశాలలో వార్షికోత్సవాలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు సౌండ్ సిస్టమ్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థులు చదువుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, విద్యతోనే ఉన్నత శిఖరాలు చేరవచ్చని సూచించారు. గురువులు చెప్పే మాటలను శ్రద్ధగా విని, దాతలు అందిస్తున్న సౌకర్యాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు దశరథరామిరెడ్డి, రఘురామిరెడ్డి, రామకృష్ణ స్వరూప్, దయాకర్‌రెడ్డి, ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కోటేశ్వరరావు, కాంచన, ఉపాధ్యాయులు పురంధర్‌రాజు, సుభాషిణి, బాబు తదితరులు ఉన్నారు.



ఈ నెల 21వ తేదీ కేరళ వరద బాధితుల సహాయార్థం ఆర్డీవో అరుణ్‌బాబు, ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌లకు ఆహారపదార్థాలు, వంటపాత్రలు, దుప్పట్లు, దుస్తులు, బిస్కెట్స్ అందజేస్తున్న ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి, సభ్యులు

# వృద్ధులు, దివ్యాంగులకు అన్నదానం



ఆశ్రమంలో అన్నదానం చేస్తున్న ప్రతినిధులు

గూడూరు పట్టణానికి చెందిన డ్రీం ఇండియా ఫౌండేషన్ వ్యవస్థాపకులు బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని ఈ నెల 18వ తేదీ అభిమానులు, స్నేహితుల ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ సాయిరాం వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం, మిఠాయిలను పంపిణీ చేశారు. ఆశ్రమంలోని వృద్ధులు, దివ్యాంగులకు చేయూతనందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సుఖసంతోషాలతో ఆనందంగా జీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువత ప్రతినిధులు రూపేష్‌రెడ్డి, పురుషోత్తం, పుల్లరాజు, పద్మ, ప్రవీణ్, శ్రీనివాసులు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఒక్కరోజు వాజ్‌పేయిలా చంద్రబాబు

శ్రీను గల్పిక

నూటపాతిక ప్రపంచ మేటి నగరాలను కాచి వడబోసి కట్టిన అమరావతి నగరమది. కృష్ణా కరకట్ట మీద హైటెక్ రత్న, ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసం. ఢిల్లీలో మహానేత వాజ్‌పేయి అంత్యక్రియలలో పాల్గొని అప్పుడే ఇంటికి వచ్చాడు చంద్రబాబు. స్నానం చేసేసి తన ఆఫీసు గదిలోకి వస్తూ హాల్‌లో వున్న భువనేశ్వరీ దేవితో... లోకేష్ ఎక్కడకు వెళ్లాడు అని అడిగాడు. రెస్ట్ తీసుకుంటున్నాడని ఆమె చెప్పింది. ఏం విరగదీసాడని ఈ టైంలో రెస్ట్ అని చంద్రబాబు అడిగాడు. మొన్న ఇంటిపైన జాతీయ జెండా ఎగురవేశాం కదండి... జెండాకు సెల్యూట్ చేసేటప్పుడు మెడ బాగా పట్టేసిందట... పడుకుని వున్నాడని భువనేశ్వరి చెప్పింది. సరేలే అంటూ చంద్రబాబు తన ఆఫీసు గదిలోకొచ్చి కూర్చున్నాడు. చంద్రబాబు ఢిల్లీ నుండి వచ్చాడని తెలుసుకుని ఎంపీలు జె.సి.దివాకర్‌రెడ్డి, సీఎం రమేష్, గల్లా జయదేవ్, మురళీమోహన్, కేశినేని నాని, మంత్రులు దేవినేని ఉమ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పత్తిపాటి పుల్లారావులు వచ్చారు. ఢిల్లీలో వాజ్‌పేయి అంత్యక్రియల విషయం వారిమధ్య చర్చకు వచ్చింది. చంద్రబాబు వారితో ఎంతైనా వాజ్‌పేయి వాజ్‌పేయే... ఎన్ని వేల కోట్లు సంపాదిస్తే ఏం లాభం... ఆ మహానేత పట్ల వున్న అభిమానం ఇంకెవరికి వస్తుంది. సాక్షాత్తూ ప్రధానే 7కిలోమీటర్లు ఆయన అంతిమయాత్రలో నడిచాడంటే మాటలా... కాకి లాగా కలకాలం కాదు, వాజ్‌పేయి లాగా పదేళ్ళు దేశం కోసం బ్రతికినా చాలు. వాజ్‌పేయి ప్రధాని కావడానికి కారణం నేనే. 1998, 1999లలో మనం సపోర్ట్ చేయబట్టే వాజ్‌పేయి ప్రధాని అయ్యాడు. ఆయన చేత అణుపరీక్షలు చేయించింది నేనే, కార్గిల్ యుద్ధం మొదలు పెట్టించిందీ నేనే, నాలుగులైన్ల రోడ్డు వేయించండని సలహా ఇచ్చిందీ నేనే... నా సూచనలకు అంతగా ప్రాధాన్యతనిచ్చేవారాయన. బ్రతికితే ఆయనలాగా బ్రతకాలి, ఆయన లాగా దేశం కోసం నిజాయితీగా పనిచేయాలి అని అనసాగాడు. అప్పుడు జేసీ దివాకర్ రెడ్డి... మనకు అవన్నీ సెట్ కావులే సార్, మనకు సెట్ కాని మనుషుల గురించి ఎక్కువ సేపు ఆలోచించకూడదు అని చెప్పాడు. అందుకు చంద్రబాబు... ఏం ఎందుకు ఆయనలా ఉండలేం, ఇప్పుడు లేమా, పాలు, పెరుగు, కూరగాయలు అమ్ముకుంటూ ఎంతో పేదరికంతో బ్రతుకుతున్న మాకు ఆ మహనీయుని మార్గాన్ని అనుసరించడం పెద్ద సమస్యేమీ కాదన్నాడు. అంతలో బయట నుండి కెవ్... కెవ్... కెవ్ మనే కేకలు వినిపించ సాగాయి. చంద్రబాబు, మిగతావాళ్ళు ఆదుర్దాగా బయటకెళ్లారు. అక్కడ గన్ మెన్‌లు, స్థానిక టీడీపీ నాయకులు క్రిందపడి కొట్టుకుంటున్నారు. వీళ్ళంతా ఎందుకు పడిపోయారా అనుకుని అటు వైపు చూసారు. అంతే వీళ్ళందరు కూడా టప్పున కళ్ళు తిరిగి పడిపోయారు.

★★★★★

నిద్రపోయాడనే గాని చంద్రబాబుకు ఆ రాత్రంతా కలలే! కలల్లో వాజ్‌పేయి తన భుజంపై చేయి వేయడం, తనకు ఫోన్ చేసి సలహాలడగడం. నిద్ర లేచాక చంద్రబాబులో ఏదో ధర్మసందేహం మొదలైంది. వాజ్‌పేయి నాకే కలలోకి వచ్చాడంటే దాని పరమార్థం తన ఆశయాలకు నన్నే వారసుడిగా భావిస్తున్నాడా? ఈ దేశంలో ఆయనలాగా నీతికి, నిజాయితీకి నిలువుటద్దం నేనే కాబట్టి ఈ దేశానికి నా నాయకత్వం అవసరమని ఆయన స్వర్గం నుండే సూచిస్తున్నాడా.. ఇలా చంద్రబాబులో మానసిక సంఘర్షణ మొదలైంది. వాజ్‌పేయిలాగా ముందు ఒకరోజు వుందాం... సులభంగా వుంటే కంటిన్యూ చేద్దామనుకునే నిర్ణయానికి వచ్చాడాయన. మొదట సచివాలయంకు వచ్చిందే తడవుగా తమ స్వార్థం కోసం పార్టీ మారి విలువలను తుంగలో తొక్కిన ముగ్గురు ఎంపీలపై బహిష్కరణ వేటు వేయాలని లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్‌కు, 23మంది ఫిరాయింపు వైసిపి ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని అసెంబ్లీ స్పీకర్ కోడెల శివప్రసాద్ రావుకు ఫిర్యాదు చేశాడు. ఈ లేఖ చూసి సుమిత్రా మహాజన్ నోరెళ్ళబెట్టగా, కోడెల శివప్రసాద్‌రావు అయితే స్పృహ తప్పి పడిపోయాడు. చంద్రబాబు తన టేబుల్ మీదున్న 'సాక్షి' పేపర్ తీసుకున్నాడు. అందులో పల్నాడులో యరపతినేని మైనింగ్ మాఫియా అనే హెడ్డింగ్‌తో వార్త. దానిని చూడగానే చంద్రబాబుకు చిర్రెత్తుకొచ్చింది. వెంటనే ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావును అరెస్ట్ చేయాలంటూ పోలీసుశాఖను ఆదేశించడమేకాక, మైనింగ్ అక్రమాలపై సిబిఐ దర్యాప్తు కోరుతూ కేంద్రానికి లేఖవ్రాసాడు. ఈ పరిణామంతో తెలుగుదేశం నాయకుల గుండెల్లో రైళ్ళు పరుగెత్తసాగాయి. చంద్రబాబు ఏంటి ఇలా మారిపోయాడంటూ వాపోసాగారు. తర్వాత పోలవరం ప్రాజెక్ట్‌పై ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పోలవరం అంచనా వ్యయం ఎంతని ఇరిగేషన్ సెక్రటరీని అడిగాడు. ఏడాది క్రితం 58వేల కోట్లు, ఏడాది గడిచింది కాబట్టి 68వేల కోట్లు అని చెప్పాడు. అది విని చంద్రబాబు ఆవేశంగా... ఒక ప్రాజెక్ట్ కట్టడానికి 68వేల కోట్లు... అది ప్రజల డబ్బనుకుంటున్నారా? మీ డబ్బనుకుంటున్నారా? 16వేల కోట్లతో ప్రాజెక్ట్ ఎలా పూర్తి చేయాలో నేను చేసి చూపిస్తా... వెంటనే అంచనాలను తగ్గించేయండి... వాజ్‌పేయి వారసుడిక్కడ అని ఆదేశించాడు. తర్వాత అమరావతి రాజధాని నిర్మాణంపై సింగపూర్ కన్సార్టియం కంపెనీ ప్రతినిధులు వాంగ్‌చుక్, జియాంగ్ టెంక్‌లతో చర్చలు జరిగాయి. అసెంబ్లీ నిర్మాణానికి చదరపు అడుగు 15వేలు అవుతుందని వాళ్ళు కొటేషన్ ఇచ్చారు. అది చూసి చంద్రబాబు... 15వందలు ఇస్తే మా నారాయణ చింతారెడ్డిపాలెం తాపీ మేస్త్రీల చేత మీరు కట్టేదానికంటే బాగా కట్టిస్తాడు... మేం అవినీతికి పాల్పడం... వాజ్‌పేయి వారసుడిక్కడ అని చెప్పి చంద్రబాబు వారిని పంపించేసాడు. అంతలో చంద్రబాబు ఛాంబర్‌లోకి జేసీ దివాకర్‌రెడ్డి, జేసీ ప్రభాకర్‌రెడ్డిలు వచ్చారు. వాళ్ళ ముఖాలలో ఆందోళన... సార్, కృష్ణా జిల్లాలో మా ట్రావెల్స్ బస్సు యాక్సిడెంట్‌కు గురైందట... డ్రైవర్ లైట్‌గా ఓ హాఫ్ తాగి నడపడంతో ప్రమాదం జరిగి పదిమంది చనిపోయారట... కేసు గీసు లేకుండా చూడండి సార్ అని జేసీ దివాకర్‌రెడ్డి అడిగాడు. చంద్రబాబు వెంటనే పి.ఏను పిలిచి రవాణాశాఖ కమిషనర్‌కు ఫోన్ కొట్టమన్నాడు. చంద్రబాబు అంతలా రియాక్ట్ కావడంతో జేసీ సోదరులు భలే సంబరపడసాగారు. టెన్షన్ ఫ్రీ అయ్యారు. అవతల రవాణాశాఖ కమిషనర్ బాలసుబ్రహ్మణ్యం ఫోన్ ఎత్తగానే పి.ఏ ఫోన్ చంద్రబాబుకిచ్చాడు. చంద్రబాబు ఆయనతో... ఈరోజు కృష్ణా జిల్లాలో దివాకర్ ట్రావెల్స్ బస్సు యాక్సిడెంట్ జరిగిందా అని అడిగాడు. అవతల నుండి కమిషనర్ అవునుసార్, దర్యాప్తు చేస్తున్నాం అని చెప్పాడు. చంద్రబాబు కోపంగా, దర్యాప్తు చేసేదేంటి, డ్రైవర్ తాగి బస్సులు నడుపుతుంటే చెక్ చేయబల్లేదా... వెంటనే ఆ దివాకర్ ట్రావెల్స్ బస్సులన్నింటిని సీజ్ చేయండి... పర్మిట్లు లేని బస్సులకు ఒక్కో దానికి కోటి రూపాయలు పెనాల్టీలు వేయండి... ప్రమాదంలో మృతి చెందిన వారికి, గాయపడ్డ వారికి వీళ్ళ వద్ద నుండే మనిషికి 50లక్షల వంతున వసూలు చేసి ఇప్పించండి... ఆ జేసీ బ్రదర్స్ ఇద్దరూ నా ఛాంబర్‌లోనే వున్నారు. పోలీసులతో వచ్చి అరెస్ట్ చేసి తీసుకెళ్ళండి అని చెప్పి ఫోన్ పెట్టేసాడు. చంద్రబాబు మాటలతో జేసీ బ్రదర్స్‌కు నోట మాట రాలేదు. ఇతను నిజంగా చంద్రబాబేనా? లేక చంద్రబాబు రూపంలో వచ్చిన నరేంద్ర మోడీనా? ఏంటీ మనిషి ఇలా మారిపోయాడు అనుకుంటూ దివాకర్‌రెడ్డి ఆవేశంగా నోరు తెరచి... బాబూ ఏం బుద్ధయ్యా నీది, కాపాడమని నీ దగ్గరకు వస్తే పోలీసువాళ్ళకు పట్టిస్తానంటావా? నీకంటే ఊసరవెల్లి నయం... వయసు, అనుభవం రాగానే సరికాదు, మంచి మర్యాద వుండాలి. అందుకే నిన్ను అందరూ తిట్టేది. బాబూ డౌన్‌డౌన్ బాబూ డౌన్‌డౌన్... అంటూ కేకలు వేయసాగాడు. అలా కేకలు వేస్తుండగానే ముఖాన నీళ్ళు పడేసరికి జేసీ దివాకర్‌రెడ్డి కళ్ళు తెరిచాడు. ఎదురుగా లోకేష్ వున్నాడు. అప్పటికే చంద్రబాబు, మిగతా ఎంపీలు, మంత్రులు లేచి కళ్ళు నులుముకుంటున్నారు. అసలు ఇంతకీ ఏమైంది, మనమంతా ఇక్కడ ఎందుకు పడుకున్నాం అని జేసీ అడిగాడు. అదిగో ఆ మహానుభావుడి పుణ్యం అంటూ చంద్రబాబు ఎదురుగా చేయి చూపించాడు. అక్కడ సోఫాలో యోగి వేమన గెటప్‌లో చిత్తూరు ఎంపీ శివప్రసాద్ కూర్చుని వున్నాడు. ఆయన గెటప్ చూసే సెక్యూరిటీ, సిబ్బంది పడిపోయారు. తర్వాత మనం వచ్చి చూసి పడిపోయాం... లోకేష్ వచ్చి అందరి ముఖాన నీళ్ళు చల్లబట్టి మెలకువ వచ్చింది. అది సరేగాని, నువ్వెందుకు 'బాబు డౌన్‌డౌన్' అని కలవరిస్తున్నావ్ అని చంద్రబాబు అడిగాడు. దానికి జేసీ... మీరు వాజ్‌పేయిలాగా బ్రతకాలని అన్నారు కదా సార్... శివప్రసాద్‌ను చూసి కళ్ళు తిరిగి క్రిందపడిపోయాక నాకు ఈ కల వచ్చింది అంటూ కల మొత్తాన్ని వివరించాడు. తర్వాత జేసీయే వుండి... సార్, మీరు ఒకరోజు వాజ్‌పేయిలాగా వుంటేనే రాష్ట్రంలో ఎందరి బ్రతుకులో తలక్రిందులవుతున్నాయి. ఇక బ్రతికినంత కాలం వాజ్‌పేయిలాగా వుంటే మన పార్టీ వాళ్ళంతా చిప్పలు చేతపట్టుకుని ఢిల్లీ వీధుల్లో భిక్షమెత్తుకోవాలి. వాజ్‌పేయి మనకు సెట్ కాదులే సార్, మరచిపోండి అని చెప్పాడు. ఆ విషయం నాకూ తెలుసు.. కాకపోతే ఆ మాత్రం బిల్డప్ వుండాలిలే అంటూ చంద్రబాబు కూడా లేచాడు.

# అన్నం పరబ్రహ్మ స్వరూపం

## • శ్రీ సాయి దర్బార్‌లో 26న నిత్యాన్నదాన సత్రానికి శంకుస్థాపన






భక్తి... భుక్తి... ముక్తి... హైందవ ఆరాధనలో ఈ మూడింటికి ప్రధాన పాత్ర వుంటుంది. భక్తి అన్నది కేవలం భగవంతుడి మీదే కాదు, చేసే పనిమీద, చదువు చెప్పే గురువు మీద, జన్మనిచ్చిన తల్లి దండ్రుల మీద... ఇలా ఎన్నో విధాలుగా భక్తిని చూపవచ్చు. అలాగే హైందవ సంస్కృతిలో భక్తి మార్గంతో పాటు భుక్తి మార్గం కూడా వుంది. మానవసేవే మాధవ సేవ అని మన సంస్కృతి మనకు సూచించిన ధర్మమార్గం. భక్తితో గుడికి వచ్చేవారికి ప్రసాదం అందించి వారి ఆకలిని కొంత వరకు తీర్చడం మన సంస్కృతిలో ఓ భాగం. పూర్వం ఎంతోమంది పేదలకు గుళ్ళల్లో ప్రసాదమే కడుపు నింపేది.

కాలక్రమంలో మానవతావాదుల ఆలోచనల నుండి పలు ఆలయాలలో నిత్యాన్నదాన కార్యక్రమాలు మొదలయ్యాయి. తిరుమల తిరుపతి దేవస్థానాలతో పాటు దేశంలోని పలు దేవాలయాలలో నిత్యాన్నదాన కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఏ దిక్కులేని అనాథ, అభాగ్యులకు, భక్తులకు భోజన వసతి కల్పిస్తున్నాయి.

ఇలాంటి మానవతా కోణంలోనే నెల్లూరు బాలాజీనగర్, పద్మావతినగర్‌లోని శ్రీసాయి దర్బార్ – అద్దాల మందిరం నిత్యాన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుంది. మందిరం ట్రస్టీ ఛైర్మెన్ మధుసాయి కృషితో మందిరానికి అనుబంధంగా నిత్యాన్నదాన నిర్వహణ కోసం ఇటీవలే స్థలంను కొనుగోలు చేసారు. ఆ స్థలంలో అన్నదాన భవనం నిర్మించాలని సంకల్పించారు. ఆమేరకు శ్రీసాయి మాత నిత్య అన్నప్రసాదాలయం నూతన భవన నిర్మాణానికి ఈ నెల 26వ తేదీ శ్రావణ పౌర్ణమి రోజున ఉదయం 9.30గంటల నుండి 11.16 గంటల మధ్య హిందూ దేవాలయాల ప్రతిష్టాపన పీఠాధిపతులు శ్రీ కమలానంద భారతి స్వామి వారి చేతుల మీదుగా శంకుస్థాపన నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా విశేష పుష్పాలంకరణతో మంగళవాయిద్యాలతో, పందరి భజనలు, కోలాటాలతో శ్రీసాయి బాబా వెండి పాదుకల ఊరేగింపు మహోత్సవం నిర్వహించనున్నారు.

సాయి సంకల్పం వుంటే ఏదైనా సాధ్యమే అనే దానికి ఉదాహరణ అద్దాల సాయిబాబా మందిరం. దాదాపు 20ఏళ్ళ క్రితం మధు సాయి నేతృత్వంలో ఓ చిన్న మందిరంగా పురుడుపోసుకున్న ఈ మందిరం అంచలంచెలుగా ఎదిగింది. భక్తుల నమ్మకాన్ని పెంచుకుంది. ఆధ్యాత్మిక కేంద్రంగానే కాక, మానవసేవా కేంద్రంగా కూడా విరాజిల్లుతోంది. ప్రతిఏటా ఉగాది, శ్రీరామనవమి, విజయదశమి వేడుకలను నిర్వహించడంతో పాటు అన్నదానం, రక్తదాన శిబిరం, వైద్యశిబిరం వంటివి నిర్వహిస్తూ భక్తుడిలోనే భగవంతుడు వున్నాడన్న సాయితత్వాన్ని ఆచరిస్తోంది. సాయి సూచించిన మానవతా మార్గంలో రేపు నిత్యాన్నదానానికి శ్రీకారం చుడుతూ మరో మెట్టు పైకి ఎక్కనుంది శ్రీ సాయి దర్బార్!

# కళ్యాణ వైభవం...!



పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జనరల్ మేనేజర్(పబ్లిక్ రిలేషన్స్) లింగారెడ్డి రాజేశ్వరరెడ్డి - మహేశ్వరిల కుమార్తె **రమ్య - సందీప్** (నాయుడుపేట వాస్తవ్యులు స్వర్గీయ సన్నారెడ్డి ప్రభాకర్‌రెడ్డి - ప్రభావతిల కుమారుడు)ల వివాహం ఈ నెల 17వ తేదీ తిరుమలలోని హంపి మఠం నందు, రిసెప్షన్ 16వ తేదీ నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ నందు జరిగాయి. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



సింహపురి గ్లాస్ & ప్లైవుడ్స్ అధినేత కోట సత్యనారాయణ - సుభాషిణిల కుమార్తె **ప్రియాంక - జగదీష్** (కృష్ణా జిల్లా మైలవరం వాస్తవ్యులు బయన శ్రీనివాసరావు - హైమావతిల కుమారుడు)ల కల్యాణం ఈ నెల 15వ తేదీ నెల్లూరులోని కస్తూరుదేవి గార్డెన్స్ నందు జరిగింది. కొత్తజంటకు 'లాయర్' శుభదీవెనలు.



ఐశ్వర్య శారీస్ అధినేత డి.వెంకటరెడ్డి - లక్ష్మిల కుమార్తె **డా॥ వెన్నెల(ఐశ్వర్య) - డా॥ రాకేష్** (హైదరాబాద్ వాస్తవ్యులు గార్లపాటి నరోత్తమ్‌రెడ్డి - సుచరితల కుమారుడు)ల పరిణయం ఈ నెల 15వ తేదీ నెల్లూరులోని కెజికె కల్యాణ మండపం నందు జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభాభినందనలు.



వెంకటాచలం మండలం చవటపాలెంలోని శ్రీ కోదండరామ స్వామి ఆలయం ఛైర్మెన్ కాసా మధుసూదన నాయుడు - లక్ష్మిల కుమారుడు **అవినాష్ - అవిజ్ఞ** (హైదరాబాద్ వాస్తవ్యులు వేమూరు హరికృష్ణ ప్రసాద్ - నీలిమల కుమార్తె)ల పెళ్లి ఈ నెల 16వ తేదీ హైదరాబాద్‌లోను, రిసెప్షన్ 20వ తేదీ విజయవాడలోని సి.కె.కన్వెన్షన్ సెంటర్‌లోను జరుగగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరై వధూవరులను దీవించారు. నవ దంపతులకు 'లాయర్' శుభాశీస్సులు

## ప్రజల దాహార్తి తీరుస్తున్న ఈ ఎమ్మెల్యేలు...

# కోటీశ్వరులు కాదు.. 'నీటీ'శ్వరులు



వాటర్ ట్యాంకర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్

ప్రజా సమస్యల విషయంలో ప్రభుత్వంపై ఎప్పుడూ దూకుడుగా వుండే నగర ఎమ్మెల్యే పి.అనిల్ కుమార్‌యాదవ్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర రెడ్డిలు తమ నియోజకవర్గాల పరిధిలో అవే సమస్యల పరిష్కారానికి తమ ప్రయత్నం తాము చేస్తున్నారు. నగరంలో మునుపెన్నడూ లేనంతగా తాగునీటి ఎద్దడి ఏర్పడింది. పలు ప్రాంతాల్లో ప్రజలు తాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ సమస్యపై స్పందించిన అనిల్ తన సొంత ఖర్చుతో రెండు మంచి నీటి ట్యాంకర్లను ఏర్పాటు చేసి, ఆయా ప్రాంతాల ప్రజల దాహార్తి తీరుస్తున్నాడు.



ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత మంచినీటి ట్యాంకర్

అలాగే నెల్లూరురూరల్ నియోజకవర్గంలో నెలకొన్న నీటి ఎద్దడిని ఎదుర్కోవడానికి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తన సొంత నిధులతో రెండు వాటర్ ట్యాంకర్లను ఏర్పాటు చేసారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని డివిజన్‌లలోగాని, రూరల్ గ్రామాలలో గాని తాగునీటి సమస్యలున్న చోటికి ట్యాంకర్ల ద్వారా మంచినీటిని అందిస్తున్నారు. ఎమ్మెల్యేలిద్దరూ కోటీశ్వరులు కాదు, బడా పారిశ్రామికవేత్తలు కాదు. కాని తమ ప్రజల సమస్యల విషయంలో వారు చూపుతున్న చొరవ, చేస్తున్న కృషి ప్రజల మన్ననలందుకుంటోంది.

# నారా హమారా.. పోస్టర్ ఆవిష్కరణ



'నారా హమారా' పోస్టర్‌ను విడుదల చేస్తున్న మంత్రి సోమిరెడ్డి

మైనారిటీల సంక్షేమమే టీడీపీ ధ్యేయమని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నా మైనారిటీల సంక్షేమానికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని రాష్ట్ర మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు ఆదిత్యానగర్ లో ఉన్న మంత్రి కార్యాలయంలో ఈనెల 21న మంత్రి సోమిరెడ్డి నారా హమారా.. టీడీపీ హమారా బహిరంగసభ పోస్టర్ లను విడుదల చేశారు. 28న గుంటూరులోని బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో జరగనున్న ఈ బహిరంగసభకు రాష్ట్రం నలుమూలల నుండి భారీగా తరలివచ్చేందుకు ముస్లీం సోదరులు ఉత్సాహంగా ఉన్నారన్నారు.. 2014కు ముందు ఉమ్మడి రాష్ట్రంలో మైనారిటీల సంక్షేమానికి రూ.300 కోట్లు బడ్జెట్ కేటాయిస్తే రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ లో టీడీపీ హయాంలో రూ. 1.102 కోట్లు కేటాయించామన్నారు. ముస్లింలకు స్వయం ఉపాధి రుణాల మంజూరు కోసం మరో రూ.250 కోట్లు అదనపు బడ్జెట్ కేటాయించమన్నారు. మసీదుల మరమ్మత్తులకు నిధులు మంజూరు చేయడమే కాకుండా ఇమామ్, మౌజన్ లకు వేతనాలు అందిస్తున్న ఘనత చంద్రబాబుదేనన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, మేయర్ అబ్దుల్ అజీజ్, సర్వేపల్లి టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలి



విద్యార్థులకు గుడ్డ సంచులను పంపిణీ చేస్తున్న మురళీ, బలరామయ్య

నెల్లూరులోని మురళీఆర్ట్స్ ఆధ్వర్యంలో ఈనెల 21న ప్లాస్టిక్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. నగరంలోని డికెడబ్ల్యు కళాశాలలో జరిగిన ఈ సదస్సులో మురళీఆర్ట్స్ అధినేత శింగంశెట్టి మురళీమోహన్‌రావు మాట్లాడుతూ, పర్యావరణానికి మానవమనుగడకు ప్రమాదకరంగా పరిణమిస్తున్న ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలన్నారు. అనంతరం గుడ్డ సంచులు పంపిణీ చేశారు. ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నలుబోలు బలరామయ్యనాయుడు, జిల్లా లారీఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉన్నం చిన్నారెడ్డిల సౌజన్యంతో 5వందల గుడ్డసంచులను కళాశాలలో పంచారు. బలరామయ్యనాయుడు మాట్లాడుతూ పర్యావరణానికి ప్రమాదకరంగా తయారవుతున్న ప్లాస్టిక్‌పై యుద్ధాన్ని ప్రకటించాలని పిలుపు నిచ్చారు. స్థానిక ప్రముఖులు పాముల రమణయ్య, పప్పు నారాయణ, బండి బలరామిరెడ్డి, న్యాయవాది రమాదేవి, వెంకటేశ్వర్లునాయుడు, బాలసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మరో 100 అన్న క్యాంటీన్లు..

ఆంధ్ర రాష్ట్రంలో 100 వున్న అన్న క్యాంటీన్లు 200 కానున్నాయని వాటికి అక్షయపాత్రే ఆహార పదార్థాలను అందించనున్నదని ఆంధ్ర, తెలంగాణా అక్షయపాత్ర డీజీయం హెచ్ ఆర్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. నెల్లూరు జిల్లా మనుబోలు ఉన్నత పాఠశాలలో పదవతరగతి విద్యార్థులకు ఈనెల 21న భవిష్యత్తు ప్రణాళిక అంశంపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అక్షయపాత్ర ద్వారా పాఠశాలలకే కాకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లకు, తెలంగాణాలో ఇందిర క్యాంటీన్లకు భోజనం అందిస్తోందన్నారు. ప్రతి విద్యార్థి తాను భవిష్యత్తులో ఎలాంటి లక్ష్యం సాధించాలో అందుకు ప్రణాళికలు వేసుకుని ముందుకు నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అక్షయపాత్ర మేనేజర్ దిపేష్, అక్షయపాత్ర భోజనం సరఫరా ఇన్‌ఛార్జి గోవర్ధన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇఫ్కో భూములపై స్టే పొడిగింపు

నెల్లూరు జిల్లా కొడవలూరు మండలంలోని ఇఫ్కో కిసాన్ సెజ్ భూముల పరిహారంపై ఈనెల 21న హైకోర్టులో విచారణ జరిగింది. ఇరువర్గాలు తమ వాదనలు వినిపించాయి. భూములపై స్టేను ఛీఫ్ జస్టీస్ నేతృత్వంలోని ధర్మాసనం తదుపరి తీర్పు ఇచ్చే వరకు స్టే కొనసాగుతుందని హైకోర్టు పేర్కొన్నట్లు సమాచారం. తదుపరి విచారణను వచ్చే నెల 11వతేదికి వాయిదా వేసింది. కాగా ఇఫ్కో ఆధీనంలో వున్న సుమారు 1050 ఎకరాల కోదండరామస్వామి దేవాలయ భూముల వ్యవహారంపై ధర్మాసనం తీవ్రంగా స్పందించినట్లుగా తెలిసింది. ఈ భూములకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని తమ ముందుంచాలని 2008లో రెవిన్యూ అధికారులను ఆదేశించినప్పటికి ఇంతవరకు సమర్పించకపోవడంతో, ధర్మాసనం ఆ కాలంలో పనిచేసిన సంబంధిత అధికారులంతా తమ ముందుకు రావాలని ఆదేశించింది.

# అందరి రాళ్ళు... ఆయనపైనే!

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన నాయకులు తమ చేతిలోని రాళ్ళను సోమిరెడ్డి మీదకే విసురుతున్నారు. మొన్నటికి మొన్న మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డిని చూసాం. జిల్లాలో జరిగిన మినీమహానాడు కార్యక్రమాలలో పాల్గొన్న ఆయన సోమిరెడ్డి మీద దుమ్మెత్తిపోశాడు. జిల్లాలో పార్టీని నాశనం చేస్తున్నాడంటూ విమర్శలు చేశాడు. సరే, సోమిరెడ్డి పార్టీని నాశనం చేశాడనే అనుకుందాం! మరి ఆనం రామనారాయణరెడ్డి తెలుగుదేశంలోనే వుండి ఆ పార్టీని బాగు చేయొచ్చు కదా! అదేం లేదు... సోమిరెడ్డి మీద టన్నుల కొద్ది బండలేసి ఆయన మాత్రం తెలుగుదేశాన్ని వదిలేసి వైసిపిలో చేరడానికి సిద్ధమయ్యాడు. తాను వైసిపిలో చేరాలనుకుంటే దానికి అభ్యంతరం లేదు. కాని సోమిరెడ్డి వల్ల పార్టీ పాడైపోతుందంటూ సర్టిఫికేట్ ఇచ్చి రావడమెందుకో?

తాజాగా ఆదాల ప్రభాకర్‌రెడ్డి కూడా సోమిరెడ్డి మీద రాళ్ళేసే పని మొదలుపెట్టాడు. ఆదాల తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ఇన్‌ఛార్జ్‌తో పాటు నెల్లూరు రూరల్, ఆత్మకూరు అసెంబ్లీల ఇన్‌ఛార్జ్‌గా కూడా వున్నాడు. 1999కి ముందు సోమిరెడ్డి, ఆదాల సఖ్యతగానే వుండేవాళ్లు. 1999లో ఆదాలకు మంత్రి పదవి వచ్చింది. అప్పటి నుండి సోమిరెడ్డికి, ఆదాలకు పడకుండా వచ్చింది. 2001లో ఆదాలకు మంత్రి పదవి పోయి సోమిరెడ్డి మంత్రయ్యాడు. వీళ్ల మధ్య విభేదాలు 2004 దాకా కొనసాగాయి. 2004 ఎన్నికల్లో ఆదాల కాంగ్రెస్‌లో చేరి సోమిరెడ్డికే రాజకీయ ప్రత్యర్థి అయ్యాడు. వరుసగా రెండు అసెంబ్లీ ఎన్నికల్లో ఆదాల చేతిలో సోమిరెడ్డి పరాజయం పొందాడు. కాంగ్రెస్ ప్రభుత్వమున్న పదేళ్ళు ఆదాల, సోమిరెడ్డిల మధ్య పాము – ముంగిసల పోరాటమే నడిచింది. 2014ఎన్నికలొచ్చేసరికి ఇద్దరూ ఒకే పార్టీలో వున్నారు. అయితే ఆదాల నెల్లూరు పార్లమెంటు ఇన్‌ఛార్జ్ కావడం, సోమిరెడ్డి ఇన్‌ఛార్జ్‌గా వున్న సర్వేపల్లి నియోజకవర్గం నెల్లూరు పార్లమెంట్ పరిధిలోకి రాకపోవడంతో వీరిద్దరూ ఒకరి వ్యవహారాలలో ఒకరు వేలు పెట్టే పరిస్థితి లేకుండా పోయింది. ఒకే పార్టీలో వున్న వీళ్ళిద్దరి మధ్య ఇప్పటిదాకా ఎలాంటి అంతర్గత విభేదాలు కనిపించలేదు. కాని ఇప్పుడు అకస్మాత్తుగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని ఆత్మకూరు సమావేశాలలో ఆదాల విమర్శలు చేస్తుండడం చర్చనీయాంశంగా మారింది.

ఇక మరో మంత్రి నారాయణ స్వతహాగా రాజకీయ నాయకుడు కాదు కాబట్టి సోమిరెడ్డిపై ప్రత్యక్ష విమర్శలు చేయడం లేదుగాని, సోమిరెడ్డికి వ్యతిరేకంగా ఎంత చేయాలో అంత నారాయణ చేస్తున్నాడు. సోమిరెడ్డిని రాజకీయంగా, అధికారికంగా ప్రాధాన్యత తగ్గించడం కోసం చంద్రబాబు వద్ద తనకున్న పలుకుబడిని ఉపయోగిస్తున్నాడు. జిల్లాలో సోమిరెడ్డి వ్యతిరేకులకు తనవంతు సాయం అందిస్తూ వస్తున్నాడు. ఇలా తెలుగుదేశం పార్టీలో అందరి టార్గెట్ సోమిరెడ్డే కావడం గమనార్హం! అయితే ఇక్కడ గమనించాల్సిన విషయం ఏంటంటే సోమిరెడ్డి మీద రాళ్ళు విసిరేవాళ్ళలో ఎవరు ఎంతవరకు తెలుగుదేశం పార్టీ పటిష్టతకు కష్టపడ్డారన్నది!

ఆదాల తెలుగుదేశం అధికారంలో వున్నప్పుడు పార్టీలో వున్నాడు. పార్టీ పదేళ్ళు ప్రతిపక్షంలో వుంటే ఆయన అధికార కాంగ్రెస్‌లో వున్నాడు. మళ్ళీ టీడీపీ అధికారంలోకి వచ్చే సమయానికి ఆ పార్టీలో చేరాడు. రేపు అదే పార్టీలో కొనసాగుతాడా అనే గ్యారంటీ లేదు. ఆనం రామనారాయణరెడ్డి అవసరం కోసం అవకాశం కోసం తెలుగుదేశంలో కొచ్చాడు. నాలుగేళ్ళు కాకముందే వైసిపిలో చేరుతున్నాడు. ఇక నారాయణ చూస్తే పార్టీకి ఇతరత్రా ఉపయోగపడివుండొచ్చు కాని రాజకీయంగా ఎలాంటి ఉపయోగం లేదు. ముఖ్యంగా ఈ జిల్లాలో తెలుగుదేశం ప్రతిపక్షంలో వున్నప్పుడు ఈ నాయకులెవరు కూడా పార్టీలో లేరు. పార్టీని మోయలేదు. ప్రతిపక్షంలో వుండి పదేళ్ళు కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాడింది, ఉద్యమాలు నడిపింది సోమిరెడ్డే! ఆనాడు వై.యస్. ప్రజాదరణ ధాటికి తెలుగుదేశం పోటీకి కూడా భయపడుతున్న తరుణంలో ఆఖరకు జడ్పీటీసీ పదవికి కూడా పోటీకి దిగింది సోమిరెడ్డే! 2011లో కోవూరు ఉపఎన్నికల్లో జగన్ ధాటికి టీడీపీ నుండి పోటీ చేయడానికి ఎవరూ ముందుకురాకుంటే, ఓడిపోతానని తెలిసి కూడా పార్టీ పరువును కాపాడడం కోసం కోవూరు బరిలో నిలిచింది ఆయనే! పార్టీ అధికారంలో వున్నప్పుడు కాదు... పార్టీ ప్రతిపక్షంలో వున్నప్పుడు భుజాల మీదనుండి కాడెను దించకుండా భారంగా బాధ్యతగా ముందుండి నడిచింది సోమిరెడ్డే!

నెల్లూరుజిల్లాలో తెలుగుదేశం బలహీనపడడానికి, బలపడడానికి ఎవరూ కారణం కాదు, ఎందుకంటే స్వతహాగా ఇది ఒకప్పుడు కాంగ్రెస్ ప్రాబల్యం, ఇప్పుడు వైసిపి ప్రాబల్యం వున్న జిల్లా! ఎవరొచ్చి పొడిచినా ఇక్కడ తెలుగుదేశం పార్టీ ఇంతకంటే లేచేదేమీ లేదు.

# తాకట్టులో తెలుగు పౌరుషం

(మొదటి పేజీ తరువాయి)

ఎన్టీఆర్ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా తెలుగుదేశం పార్టీని స్థాపించడమే కాదు, తన కొనఊపిరి ఉన్నంతవరకు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పోరాడాడు. తాను బ్రతుకున్నంత కాలం కాంగ్రెస్‌ను ఆయన బద్ధశ్రతువుగానే చూసాడు. పార్టీ పెట్టిన 9నెలల్లోనే ఆంధ్రప్రదేశ్‌లో అధికారాన్ని చేపట్టిన రికార్డు ఎన్టీఆర్‌ది. అయితే ఏడాది తిరక్కముందే కుట్రపన్ని ఎన్టీఆర్‌ను పదవీచ్యుతుడిని చేసిన ఘనత కాంగ్రెస్‌ది. తెలుగు ప్రజలందరూ ఏకతాటిపై నడిచి ఆరోజు మళ్ళీ ఎన్టీఆర్‌ను గద్దెనెక్కేలా చేశారు.

1977లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా కేంద్రంలో ఏర్పడ్డ జనతా ప్రభుత్వం ఏడాదికే కుప్పకూలిపోయింది. మళ్ళీ పదేళ్ళ దాకా జాతీయ రాజకీయాలలో అలాంటి ప్రయోగాలు జరగలేదు. కాని ఎన్టీఆర్ జాతీయ స్థాయిలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నేషనల్ ఫ్రంట్‌ను ఏర్పాటు చేసాడు. 1989లో నేషనల్ ఫ్రంట్‌ను కేంద్రంలో అధికారంలోకి తీసుకురావడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. 1984 లోక్‌సభ ఎన్నికల్లో ఇందిరాగాంధీ హత్యానంతరం వెల్లువెత్తిన సానుభూతిలో దేశమంతా కాంగ్రెస్ గెలిస్తే, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం తెలుగుదేశం హవా పనిచేసింది. 34సీట్లతో లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్షంగా ఎన్టీఆర్ తెలుగుదేశం కూర్చొంది. అలాంటి రికార్డు టీడీపీది! కాంగ్రెస్ విషయంలో ఎన్టీఆర్ పాజిటివ్‌గా వ్యవహరించిన సందర్భం ఏదన్నా ఉందంటే అది 1992లో నంద్యాల లోక్‌సభ ఉపఎన్నికల్లో తన పార్టీ అభ్యర్థిని పోటీ పెట్టకుండా కాంగ్రెస్ అభ్యర్థి పి.వి.నరసింహారావుకు మద్దతు పలకడమే! అది కూడా ఎన్టీఆర్ కాంగ్రెస్‌కు మద్దతు తెలపలేదు. ఒక తెలుగోడు ప్రధానమంత్రిగా వున్నాడని చెప్పి, సాటి తెలుగోడిగా తొలి తెలుగు ప్రధాని పి.వి.నరసింహారావుకి మద్దతు పలికారంతే!

ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీ ఆయన చేతుల్లో నుండి ఎలా వెళ్ళిపోయింది, ఇప్పుడు ఎలా నడుస్తుందనే చరిత్ర అందరికీ తెలిసిందే! కాకపోతే తెలుగుదేశం పార్టీ విషయంలో ఇప్పుడు మరో కొత్త చరిత్ర మొదలు కాబోతోంది. చంద్రబాబు డైరెక్షన్‌లోనే ఎన్టీఆర్ పెట్టిన తెలుగుదేశం రూపురేఖలు ఆసాంతం మారబోతున్నాయి. ఏ కాంగ్రెస్‌పార్టీకైతే వ్యతిరేకంగా ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని పెట్టాడో, అదే తెలుగుదేశం పార్టీ ఇప్పుడు కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోవడానికి సిద్ధమైంది. దీని కోసం తెరవెనుక జరగాల్సిన తతంగాన్నంతా చంద్రబాబు పూర్తి చేసేసాడు.

1995లో చంద్రబాబు చేతుల్లోకి తెలుగుదేశం వచ్చింది. అప్పటి నుండి ఏ ఎన్నికల్లోనూ ఆయన ఒంటరిగా పోరాడలేదు. ఏదో ఒక పార్టీతో పొత్తు ఉండనే వుంటుంది. 1999, 2004 ఎన్నికల్లో బీజేపీతో కలిసాడు. 2009 ఎన్నికల్లో టిఆర్ఎస్, వామపక్షాలతో పొత్తు, 2014 ఎన్నికల్లో మళ్ళీ బీజేపీతోడు... ఇప్పుడు బీజేపీతోనూ పొత్తు తెగిపోయింది. ఎన్డీఏ నుండి తెలుగుదేశం బయటకు రావడం తెలిసిందే! 2019 ఎన్నికల్లో ఒంటరిగా పోవాలంటే చంద్రబాబుకు భయం పట్టుకుంది. ప్రత్యేకహోదా విషయంలో బీజేపీపై ప్రజల్లో వున్న వ్యతిరేకత తనపై పడుతుందనే భయంతోనే ఆయన ఆ పార్టీని వదిలించుకున్నాడు. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను చీల్చడానికి జనసేన చేత విడిగా పోటీ చేయిస్తున్నాడు. ఇక పొత్తుకు వున్న అవకాశం కాంగ్రెస్ మాత్రమే! తాము అధికారంలోకి వస్తే ఏపికి ప్రత్యేకహోదా ఇస్తామని కాంగ్రెస్ అంటోంది. ఈమధ్య పార్లమెంటు సాక్షిగా కాంగ్రెస్, తెలుగుదేశంల మధ్య స్నేహం అనే మొగ్గ చిగురించింది. ఎన్డీఏ ప్రభుత్వంపై తెలుగుదేశం పెట్టిన అవిశ్వాస తీర్మానానికి కాంగ్రెస్ మద్దతునిస్తే, రాజ్యసభ డిప్యూటీ ఛైర్మెన్ ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థికి టీడీపీ మద్దతు పలికింది! ఇక కర్నాటకలో కుమారస్వామి ప్రభుత్వ ఏర్పాటప్పుడు రాహుల్–బాబు చెట్టపట్టాలేసుకోవడం, ఇటీవల హైదరాబాద్‌కొచ్చిన రాహుల్‌ను నారా బ్రాహ్మణి కలవడం వంటివన్నీ ఇరు పార్టీల మధ్య బలపడుతున్న స్నేహబంధానికి తీపిగుర్తులు.

జాతీయ రాజకీయాలలో మోడీ గ్రాఫ్ పడిపోతోందని, రాహుల్ క్రేజ్ పెరుగుతుందని చంద్రబాబు నమ్ముతున్నాడు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోనే ప్రభుత్వం ఏర్పడుతుందని భావిస్తున్నారు. ఈ ముందుచూపుతోనే కాంగ్రెస్‌తో పొత్తుకు సిద్ధమవుతున్నారు. తెలంగాణలో ఈసారి అధికారంలోకి రావాలని కాంగ్రెస్ పంతంతో వుంది. అక్కడ కాంగ్రెస్‌తో టీడీపీ జత కలిస్తే టీఆర్ఎస్‌కు కొంతవరకు నష్టమే! తెలంగాణలో టీడీపీకి ఇంకా అంతో ఇంతో కేడర్ మిగిలేవుంది. తెలంగాణలో తాము తక్కువ సీట్లు తీసుకుని కాంగ్రెస్‌కు ఎక్కువ సీట్లు వదలడం, అలాగే ఏపిలో కాంగ్రెస్‌కు ఓ ఇరవై లేదా పాతిక సీట్లిచ్చి మిగతా సీట్లలో తాము పోటీ చేయడం చంద్రబాబు ప్లాన్. ఈ పొత్తు ద్వారా టీడీపీ సపోర్ట్‌తో తెలంగాణలో కాంగ్రెస్, ఏపిలో కాంగ్రెస్ మద్దతుతో టీడీపీ అధికారంలోకి రావాలన్నది ప్రణాళిక! టీడీపీతో పొత్తుకు కాంగ్రెస్ సిద్ధంగానే వుండడంతో ఈ రెండు పార్టీల చారిత్రాత్మక తప్పుడు కలయికకు త్వరలోనే ముహూర్తం ప్రకటించే అవకాశముంది.

ఈ తతంగమంతా స్వర్గం నుండి ఎన్టీఆర్ ఆత్మ చూస్తుందనుకోండి... ఏమవుతుంది... ఈ లోకంలో వుండగా ఆయన స్థాపించిన పార్టీ నుండే ఆయనను బయటకు గెంటేసి, మానసిక క్షోభకు గురిచేసి అన్ని విధాలా ఆయన కుంగిపోయేలా చేసారు. ఇప్పుడు పైలోకంలో వున్న ఎన్టీఆర్ ఆత్మను కూడా ప్రశాంతంగా ఉండనీయడం లేదు. కాంగ్రెస్‌తో తెలుగుదేశం పొత్తు పెట్టుకోవడాన్ని పైనుండి ఎన్టీఆర్ ఆత్మ చూస్తే... బహుశా ఆత్మకు ఆత్మహత్య చేసుకునే అవకాశం వుంటే అదే జరుగుతుందేమో!

# కేసీఆర్ సై.. బాబు నై!

(మొదటి పేజీ తరువాయి)

'వన్ నేషన్ – వన్ ఎలక్షన్' అనే నినాదంతో ఏకకాల ఎన్నికల కోసం ప్రయత్నిస్తున్న కేంద్రప్రభుత్వం దానిపై లా కమిషన్, ఎన్నికల కమిషన్‌ల ద్వారా పెద్దఎత్తునే కసరత్తు చేయించింది. దేశంలోని 29 రాష్ట్రాలలో ఒకేసారి లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించడం కష్టమే! ఎందుకంటే సగానికిపైగా రాష్ట్రాలలోని ప్రభుత్వాల పదవీకాలం గడువు చాలానే వుంది. కాని, అన్నీ సవ్యంగా జరిగితే 11 రాష్ట్రాలకు మాత్రం లోక్‌సభతో పాటే అసెంబ్లీ ఎన్నికలు కూడా జరిపేయవచ్చు. అది కూడా డిసెంబర్‌లోనే! దీనికి దాదాపు అన్ని రాష్ట్రాలు సుముఖంగానే వున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ సీఎం కేసీఆర్ అయితే కేంద్ర ప్రకటనతో పని లేకుండానే డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలకు పోతున్నట్లు ప్రకటించాడు. కాని ఏ.పి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాత్రం అందుకు ససేమిరా అంటున్నాడు. ముందస్తు ఎన్నికలకు భయపడుతున్నాడు. ఎన్నికలంటే కేసీఆర్‌లో భయం లేదు. ఏరోజు ఎన్నికలు జరిగినా తిరిగి అధికారంలోకి వస్తాననే ధీమాతో వున్నాడు. అందుకే పార్టీ సమావేశంలో తన మంత్రులు ముందస్తుకు పోవద్దని చెప్పినా కేసీఆర్ వినలేదు. కేసీఆర్ ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు లేవు. భారీ కుంభకోణాలు లేవు. పెద్దఎత్తున సంక్షేమ పథకాలతో కేసీఆర్ ప్రభుత్వం ప్రజల ఆదరణ పెంచుకుంది. టీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో పెద్దగా వ్యతిరేకత లేదు.

కాని, ఏపిలో చూస్తే తెలుగుదేశం ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వుంది. ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలున్నాయి. ఏ సంక్షేమ పథకం సక్రమంగా అమలు జరగడం లేదు. ఎన్నికలలో ఇచ్చిన వాగ్ధానాలను అమలు చేయడంలో చంద్రబాబు అట్టర్‌ఫ్లాప్ అయ్యాడు. అమరావతి రాజధాని గ్రాఫిక్ సినిమాగా తయారైంది. దీనికితోడు రాష్ట్రంలో కుల రాజకీయాలు పెరిగాయి. బీజేపీ తెగదెంపులు ఏ తల నొప్పి తెస్తుందోనని బాబు భయపడుతున్నాడు. ఇక మైనింగ్ మాఫియా, పి.డి అకౌంట్లపై ఆరోపణలు చంద్రబాబును ఊపిరాడనీయడం లేదు. పచ్చమీడియా అండ లేకుండా వాళ్ళు వాస్తవాలు వ్రాసే పనైతే చంద్రబాబు ఎప్పుడో గబ్బుపట్టేవాడు. వాళ్ళు సమర్థిస్తున్నారు కాబట్టే చంద్రబాబు ఈ మాత్రం నిలబడ్డాడు. వీటన్నింటి నుండి బయటపడాలంటే చంద్రబాబుకు ఇంకా కొంత సమయం కావాలి. అందుకే ముందస్తుకు నై అంటున్నాడు.

# శ్రద్ధాంజలి



మా ఇంటి జ్యోతి, నిరంతరం మా హృదయాలలో వెలిగే ధృవతార, మాకు మార్గదర్శకులు, అనురాగమూర్తి

## కీ।। శే।। శ్రీ గునుపాటి సుబ్బరామిరెడ్డి గారు

(కొత్తూరు గ్రామం, ఇందుకూరుపేట మండలం)

పరమపదించి ఆగస్టు 27, 2018 నాటికి 28 సంవత్సరాలు నిండుతాయి
ఆ మహనీయమూర్తిని సంస్మరించుకుంటూ... వారి ఆత్మకు శాంతి చేకూరుటకై ప్రార్థిస్తున్నాము.

అర్ధాంగి: **కీ।।శే।। గునుపాటి రుక్మిణమ్మ**

కుమారులు – కోడళ్ళు

**గునుపాటి వెంకటకృష్ణారెడ్డి – ఇందిరమ్మ**
**గునుపాటి జనార్ధన్‌రెడ్డి – సునీతమ్మ**
**గునుపాటి రామ్‌మోహన్ రెడ్డి – శుభప్రదమ్మ**

కుమార్తెలు – అల్లుళ్ళు

**కోటిరెడ్డి నిర్మలమ్మ – కీ।। శే।। కోటిరెడ్డి రామచంద్రారెడ్డి**
**అత్తివరపు విమలమ్మ – అత్తివరపు రామచంద్రారెడ్డి**
**దొడ్ల లలితమ్మ – దొడ్ల పద్మనాభరెడ్డి**

మరియు **మనుమలు, మనుమరాళ్ళు, మునిమనుమలు, మునిమనుమరాళ్ళు**

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com